# జై వాసవీ సాయి చారిటబుల్ ట్రస్టు చెన్నయ్ వారు చెన్నయ్ ఆర్మీనియన్ వీధిలో వినువీధినంటే గోపుర శిఖరంతో నిర్మించిన సాయి ఆలయం!

**ఆలయం నిర్మించినా, ఏ ధర్మసంస్థ స్థాపించినా, ఏ ధర్మ కార్యాలు చేసినా, ఆర్యవైశ్యులకు సములు 'ధ'రణిని లేరు! లేరని జై వాసవీ సాయి చారిటబుల్ ట్రస్టు చేతల్లో చూపించింది! 2013 సం॥ము మే 12 వ తేదీ భానువారం భానోదయం షిర్డీ సాయినాధుని కిరణ 'కరుణోదయం'తో భాసిల్లింది!**



సాయి ఆలయం నిర్మించిన వైశ్య శ్రేష్ఠులందరూ సాయి నామాంకిత భక్తులే! చెన్నయ్ మహానగరంలో వైశ్యుల ధర్మనిరతి చిరునామా చెరుగకుండా ధర్మకార్యాలు చేబడుతున్నవారే.

ఆలయ నిర్మాణ కర్తృత్వంలో 'అజంతా' కని గెలుపుల శంకరరావు, గొల్లపూడి మురళీమోహన్, ఎం.వి.నారాయణ గుప్తా, సిహెచ్ రామమూర్తి, గోపురం వై.వి. హరికృష్ణ, వివేక్ బి.ఏ. చంద్ర శేఖర్ శెట్టి, ఎన్. చిరంజీవి. టి. రాజశేఖర్, డి. బాలకృష్ణ ట్రస్టీలందరూ ధార్మిక సేవా కార్యక్రమ దురంధరులు. వీరందరికీ ప్రముఖాంధ్ర శుభాశీస్సులు. వీరంద రికీ నేపద్యనాయకుడు భక్తశిఖామణి ఆర్.ఆర్. నాథం. ఆర్యవైశ్య కులానికి ఆదర్శ ప్రముఖుడు. వీరిని అత్యున్నత అధికార పదవులు నిర్వహిస్తూ అందరికీ ఏడు దశాబ్దములుగా తలలోని నాలు కలా నిలిచే ప్రముఖుడు, ప్రస్తుత తమిళ నాడు రాష్ట్ర గవర్నరు శ్రీశ్రీ కొణిజేటి రోశయ్య సువర్ణ హస్తాల మీదుగా అక్షయ తృతీయ శుభ దినమున కుం భాభిషేక కార్యక్రమం జరుగ డం శుభావహం.

ఆర్య వైశ్యులు అందరూ ఆర్యధర్మ పరులు. వాసవీమాత వరాన్నవరదులు– వాసి రాశిగల వైశ్య కులమున వెలసిన విమలయశులు. పెద్ద కోమట్లను పేరు పేర్మి కలిగె! కోటికిని పడగలెత్తిన పెదకోమటి బిరుదా వళిసులు

**కోటిలోన ఒకడైన మీకు సాటియౌతారా**
**కన్యకాపరమేశ్వరి కాపుదల మీకు కలదు!**
**ఎన్నినోముల పుణ్ణెమో కన్యక తల్లివలన ఘనతకెక్కినారు**
**వైశ్యకులమును గొప్పగా వాసికెక్కిరయ్యా**
**ఎన్ని జన్మల పుణ్యమో ధర్మమూర్తులైరీ!**

దయాగుణము, దానగుణము, క్షమా గుణము ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్య లక్ష్మి కొలువుంటూ దేశనాయకులు, త్యాగధ నులు కలిమి చెలు వొందు ఆర్యవంశమున బుట్టి ఆర్ష ధర్మ ప్రకాశులైరి. వైశ్యరత్నము లుగా వాసిగన్న మీరు లేకున్నా ఇతర కళలు వితరణములు బోసిపోవు!

భళిర శ్రీనివాస భవ్య ప్రకాశ భాను ప్రభాస శ్రీరస్తు శుభమస్తు. విజ యోస్తు. దీర్ఘాయు కలిగి ధన ధాన్య ములు, కలిగి, రాజసన్మానము లంది ధన కనక వస్తు వాహన ములు దండిగా కలిగి కొడు కులు, కోడండ్రు కొమార్తెలల్లుళ్ల తోడ తేజంబు ప్రాభవంబు స్తోమంబులు కలిగి రాజీవ మఖహంస స్థిర లక్ష్మీనివాస సుజన వ్యాపార మనోదీశ పరహిత మది మాణిక్య మణి పూసలై విజయులై వర్ధిల్లవలెనయ్య ప్రముఖాంధ్ర శాశ్వతాశీర్వాద సత్యపలుకలయ్య! ●



**మాతా కన్యకుమారి**
**సంజీవినీ పీఠం అధినేత్రి**
**ఆమెకు ఆంజనేయుడే**
**సర్వస్వమూ!**

## సర్వపాప విమోచని
# శ్రీహనుమత్ సూక్తం

శ్రీమాన్ సర్వలక్షణ సంపన్నః జయప్రదః సర్వాభరణ భూషిత ముదారం, మహోన్నతోష్ట్ర మారుడః కేసరీ ప్రియనందన : వాయు తనూజా : యథేశ్చ పంపాతీర విహారీ గంధమాదన సంచార : హేమ ప్రాకారాంచిత కనక కదలీవనాంతర నివాసీ పరమాత్మా, వనచర శాప విమోచనః, హేమవర్ణాం నా నా రత్న ఖచిత మమూల్యతరాం మేఘలాం చ స్వర్ణోపవీతం కౌశేయ వస్త్రం చ భి భ్రాణః సనాతన! పరమపురుషః మహాబలః అప్రమేయ ప్రతాపశాలీ, రజితవర్ణః, శుద్ధ స్పటిక సంకాశః, పంచవదనః పంచదశనేత్రంః సకల దివ్యాస్త్రధారీ, శ్రీ సువర్చలా రమణః మహేంద్రా దృష్ట దిక్పాలక త్రయస్త్రింశ ద్గీర్వాణము నిగణ గంధర్వ యక్ష కిన్నర పన్నగ సురపూజిత పాద పద్మయుగళః నానా వర్ణః కామరూపః కామచారః యోగిధ్యేయః శ్రీహనుమాన్, ఆంజనేయో, విరాడ్రూపీ, విశ్వాత్మా, విశ్వరూపః పవన నందనః పార్వతీ పుత్రః ఈశ్వర తనూజౌ సకల మనోరథా న్నో దదాతు॥

తా॥ ఈ శ్రీహనుమత్సూక్తమును ఒక్కమారు పఠించిన సర్వపాపముల నుండి విముక్తిలౌతారు. రెండుమార్లు భక్తితో పఠించిన, పుణ్యతీర్థములందు స్నానమాడిన ఫలితము, వేదవేదాంగములు నేర్చిన ఫలితములు కలుగుతుంది. మూడుమారులు పఠించిన ఐహికములుగు సుఖముల నంది హనుమదనుగ్రహం పొందుతారు. ఒక్కసారి మాతాజీ సంజీవనీ మందిరం దర్శించండి. ●

# 1.86 కోట్ల ఏళ్ళ క్రితం పుడితే, ఇప్పుడెందుకు... శ్రీరాముణ్ణి కొలుస్తున్నారు!

**శ్రీరాముణ్ణి ఆదర్శ జీవితం చెప్ప కుండా భారత ఐతిహాసిక ధర్మం వర్థిల్లదు!**

ఆహా పురుషోత్తముడంటే ఇలా ఉండాలని' నిన్నటి దాకా మనం పొడిగిన వ్యక్తిని ఆయన కాలం చేసిన మర్నాడే మరచిపోతున్నాం. ఎవరన్నా గుర్తు చేసినా "ఇప్పుడు లేని వాళ్ల గురించి ఎందుకు?" అంటూంటాం.

గణిత లెఖ్ఖ ప్రకారం–రామచంద్రుడు భరతఖండంలో ఒక రాజ కుటుంబమున పుట్టి ఒక కోటీ 86 లక్షల 36 వేల సంవత్సరాలు గడించింది. యుగాలు గడిచిపోయాయి. యుగధర్మాలు మారిపోయాయి. అయినా ఇప్పటికీ – ధర్మమూర్తి అనేవాడు ఎలా వుండాలంటే శ్రీరాముడిలా వుండాలనే గుర్తు చేసుకుంటాం.

**'ఎందాక కులా ధరావళు**
**లెందాక నదీ నదంబు లిలవెలయునో తా**
**నందాక రామకథ జగ**
**మందున్ స్థిరమగుచు వెలయు...నన్నది సత్యం.**

సాధురక్షణ, దుష్టశిక్షణ ధర్మసంస్థాపన ఆచరించాడు. సామాన్యధర్మం, విశేష ధర్మం అని రెండు ధర్మాలు ఆచరించిన శ్రీరామచంద్రుడు ధర్మా చార్యుడు. తాను ధర్మాన్నెరిగి ఆచరించి, ఆచరింపజేసిన మర్యాదా పురుషోత్తముడు.

రామచంద్రునితో సమానమైన వారు చరిత్రలో మనకు కనబడరు. ఆయన పరబ్రహ్మ పరంధామ పరామాత్మ సాక్షాత్తూ నారాయణుడు అయిన తాను దశరథ కుమారుడైన రామునిగానే ప్రకటించు కున్నాడు. పరబ్రహ్మమని ఎక్కడా ప్రక టించుకోలేదు. గుణాలు అనన్యం. మానవాతీతం. సకల సద్గుణాభిరాముడు శ్రీరాముడు.

కుమారునిగా, స్నేహితునిగా, బంధు వుగా, మిత్రునిగా, భర్తగా, సోదరునిగా, ప్రభువుగా ఆయన ఆచరించి చూపిన ధర్మం ఆదర్శం కర్మణా ధర్మం మరెక్కడా కనబడదు.



తనకు వచ్చిన కష్టాన్ని గురించి బాధపడేవాడు కాదు. పరుల దుఃఖాన్ని చూసి పరితపించేవాడు. పట్టాభిషిక్తుడు కానున్న సమయంలో కైక కోరిన వరాలు విన్న రాముడు తన తల్లిపట్ల ఎలాంటి భావాలు కలిగి ఉన్నాడో, అటు తర్వాత కూడా అవే మనోభావాలు కలిగి ఉన్నాడు. ఏ మాత్రం తొణకలేదు. రామభరతాదు లతో కైకపై ఆగ్రహింపవలదని, గౌరవ భావంతో ఉండాలని సలహాలుయిస్తాడు. రాముని పితృభక్తి అనన్యమైనది, అద్వితీయం, సాటిలేనిది. పితృ వాక్పరిపాలకుడు రాముడే అన్న కీర్తి రామునికొక్కనికే ఉన్నది. పితృవాక్పరిపాలనలో మేరు నగధీరుడైమెలిగాడు రాముడు.కైకతో మాట్లాడే సమయంలో...

**'నృపునాజ్ఞజేసి విను వహ్ని జ్వాలకున్ దేహమున**
**భిస్సా మాత్రము జేసెదన్ విషము తేన్వేత్రావుదుం గంధి**
**హిస్సంరంభము మీఅజొచ్చెదను శంకాతంక మింకేటికిన్'**

(రాజాజ్ఞ అయినచో మంటలలో దూకుతాను. విషం త్రాగుతాను. సము ద్రంలో మునుగుతాను. నువ్వెందుకు సందేహిస్తావు.) అంటాడు.

సీతారాములు జగత్తుకే ఆదర్శ దంపతులు. రాముడు ఏకపత్నీవ్రతుడు. మనసులో కూడా అన్య స్త్రీని కామవాంఛతో తలచని మహనీయుడు. పట్టాభిషిక్తుడైన రాముడు– సీతమ్మను అడవులకు పంపి, యాగ సమయంలో ఆమె స్వర్ణప్రతిమను ఉంచి యజ్ఞం పూర్తిచేసిన మహనీయుడు. స్త్రీకి పాతి వ్రత్యమెంత ముఖ్యమో పురుషునకూ ఏకపత్నీ వ్రత నియమం అంతే అవసరమని చాటాడు. భార్యాభోగానుభవనానికి కాదు, ధర్మాచరణకి అని ఆచరించి చూపాడు.

సీతాపహరణం జరిగినప్పుడు సామాన్య మానవునిలా భార్యా వియోగాన్ని తాళలేక 'హా సీతా హా సీతా' అని విలపించాడు. పిచ్చివాడి వలె చెట్టును, పుట్టను కూడా అడిగాడు. భర్తగా శ్రీరాముడెట్టివాడో అన్నగా తన సోదరులను ప్రేమించ డంలోనూ అలాంటివాడే. సీతాదేవిని అడవులకు రావద్దనే సందర్భంలో ఆమెతో...

**'భ్రాతృ పుత్ర సమౌచాపి– దృష్ఠా వ్యేచ విశేషతః**
**త్వయా భరత శత్రుఘ్నౌ– ప్రాణవైః ప్రియత రౌమమ"**

(సీతా! నా సోదరులు భరత శత్రుఘ్నులు నా ప్రాణముల కన్నా ప్రియులు, కనుక నువ్వు వారిని సోదరులవలె, పుత్రులవలె చూసుకోవాలి అంటాడు)

రావణుని శక్త్యాయుధం తాకి లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు రామునిలో పెల్లుబుకిన దుఃఖం ఆయన సోదర ప్రేమకు నిదర్శనం.

రావణ వధ జరిగాక కొన్నాళ్లు లంకలో ఉండమని విభీషణుడు వేడుకోగా "భరతుని చూడాలని నా మనస్సు తహతహలాడుతున్నది" అన్న రాముని ప్రతిస్పందన వారి ప్రేమాను రాగాలకు మరో మచ్చుతునక.

అవతార సమాప్తి సందర్భంగా లక్ష్మణుడ్ని పరిత్యజించినప్పుడు సోదర ప్రేమవల్ల "నేను రాజ్యమేలలేను. లక్ష్మణుడ్ని అనుసరిస్తాను" అనడంలో ఎంతో ఔచిత్యం ఉన్నది.

తన సోదరులపై రాముడెలాంటి ప్రేమానురాగాలు కలిగి ఉండవేవాడో మిత్రుల పట్ల కూడా అదే రకమైన ప్రేమానురాగాలనే కలిగి ఉండేవాడు. గుహుడు, సుగ్రీవులపై రాముడు ప్రదర్శించిన మైత్రీ బంధం ముగ్దుల్ని చేస్తుంది. రామ పట్టాభిషేకా నంతరం రాముడు అయోధ్యలో ప్రధాన వానరులతో "మీరు నా స్నేహితులు, సోదరులు, నా శరీర భాగాలు కూడా" అని అన్నాడు. ఎంత అంకిత భావమిది.

విభీషణునికి అభయప్రదానం రాముని హృదయ వైశాల్యానికీ, నైర్మల్యా నికీ దర్పణం. సమీపంలో ఉన్న వానర వీరులు వలదంటున్నా అభయమిచ్చాడు; శరణుజొచ్చిన వానికి అభయమీయడం తన వ్రతమన్నాడు.

రామచంద్రుని ఔదార్యం, కృతజ్ఞత సర్వమానవాళినీ ఆశ్చర్యచకితులను చేస్తుంది. రావణునితో పోరాడి రెక్కలు ఖండింపబడి కొన ఊపిరితో ఉన్న జటా యువు సీతాదేవిని లంకాధీశుడు అపహ రించిన విషయం చెప్పి ప్రాణాలు వదలగా – తాను కృతజ్ఞతతో తన తండ్రికి కూడా చేయ వీలుపడని అంత్యక్రియలు చేస్తాడు. పక్షి గదా అని ఏమాత్రం ఉపేక్షించలేదు.

యుద్ధరంగంలో నిరాయుధుడైన రావణుని తేలిగ్గా సంహరించగల తరుణ మొచ్చినా – యుద్ధ ధర్మమెరిగిన రాముడు "అలిసితివి – నిరాయుధుడవు – నిన్ను సంహరించను. నేడు పోయి రేపు రమ్ము పొమ్ము" అని చెప్పిన మానవతావాది.

హనుమంతుని పట్ల స్వామి ప్రకటించిన విశ్వాసం జగత్తులో మరెక్కడా కనిపించదు. రాముడు పరిపూర్ణ కృతజ్ఞతా భావంతో నిండారు ప్రేమానురాగాలతో ఆంజనేయుడికి గాఢ పరిష్వంగనం చేస్తాడు.

"భార్యను రక్షించుకోలేని వాడు ప్రజలనేమి రక్షించగలడన్న భావం ప్రజల్లో కలగడకుండా ఉండేందుకే యుద్ధం చేసి రావణాదులను సంహరించడం జరిగింది. మరి అగ్నిప్రవేశమెందుకంటే సీత పూత చరిత సాధ్వియని లోకానికి వెల్లడించడానికి తానమితంగా ప్రేమించే సీతపై నగరవాసి ఎవడో నింద మోపాడన్న మిషతో ఆమెను త్యజిస్తాడు. ఎంతటి స్వార్థత్యాగి?

రాముని శౌర్య ధైర్య పరాక్రమాలు వర్ణనాతీతాలు. తాటక వధ, శివ ధనుర్భంగం, ఖరదూషణాది 14 వేల మంది రాక్షసులను భూమిపై నిల్చి స్వల్పకాలంలోనే సంహరించడం –వాలి వధ, దిక్పాలురను సైతం జయించిన రావణ సంహారం, కుంభకర్ణ వధ – రాముని పరాక్రమానికి నిదర్శనాలు.

కాకాసుర రక్షణంలో స్వామి శరణాగత వాత్సల్యం మహోన్నతం. అందుకే, ఎన్ని కోట్ల సంవత్సరాలు గడిచినా మానవులకు ఆదర్శం శ్రీరాముడే.

*– శ్రీ అనగాని సౌభాగ్యరావు గారికి కృతజ్ఞతలతో*


# శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రసాదంగా లడ్డూ ప్రసాదం నిర్దేశించింది బ్రిటీష్ పాలకులే!

## - బ్రిటీష్ పాలనలో ఆలయ ఆలన పాలన చేసినా ఆచార వ్యవహారాల్లో వారు వేలు పెట్టలేదు!! -




తెల్లదొరల పాలన వేంకటేశ్వరస్వామివారిపట్ల భక్తిశ్రద్ధలతో సాగింది. ఆ పాలన సక్రమంగా సాగేందుకు ప్రాంతీయ న్యాయమూర్తి జస్టిస్ బ్రూస్ 1881 సం॥ము జూన్ 25న ప్రత్యేక నియమావళిని రూపొందించారు. అది బ్రూసుకోడ్‌గా అమలు జరిగింది. శ్రీవారి ఆలయంలో సేవలు, సిబ్బంది విధులు, ఆలయ ఖర్చులు, ఆదాయం, తిరుమల ఐతిహాసిక చరిత్రను ప్రచురించడం, భక్తుల రవాణా సౌకర్యం నిమిత్తం ఘాట్‌రోడ్డును నిర్మించడం వంటివన్నీ జరిగాయ్. 1944 సం॥ములో బ్రిటిష్‌గవర్నర్‌గా ఉన్న లార్డ్ హోప్ ఆధ్వర్యంలో ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేతృత్వంలో మొదటి ఘాట్‌రోడ్డు రూపకల్పన చేసింది తెల్లదొర లార్ట్ హోపే! ఇదంతా ఉద్యోగపరంగానే, భద్రంగా నిర్వహించిన చారిత్రక అంశముల సమాహారం.

సుమారు రెండు వందల ఏళ్లకు పైగా దేశాన్ని పరిపాలించిన తెల్ల దొరలు సైతం తిరుమల వెంకన్నస్వామి సేవకులు. వీరి హయాంలోనే శ్రీవారి ఆలయ పాలనకు పటిష్టమైన పునాదులు ఏర్పడ్డాయి. కఠినమైన నిబంధనలు, క్రమశిక్షణ పద్ధతులు అమలయ్యాయి. నేటికీ తిరుమల ఆలయం, టిటీడీ పరిపాలనా వ్యవహారాల్లో బ్రిటిష్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. నాటి బ్రిటిష్ బ్రూస్‌కోడ్ టిటీడికి నేటికీ దిక్సూచిలా ఉంది. 43 ఏళ్ళపాటు తిరుమల ఆలయ పాలన వ్యవహారాలు బ్రిటిష్ ఈస్టిండియా కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ ఉత్తర ఆర్కాట్ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సాగింది. అప్పటికే ఆలయ సిబ్బంది, అర్చకులు, జీయర్ల మధ్య సఖ్యత కొరవడిందని చరిత్ర. దీంతో బ్రిటిష్ పాలకులు కఠిన నిబంధనలు అమలు చేసి క్రమశిక్షణతో ఆలయపాలనను గాడిలో పెట్టారు. ఆనాటి నార్త్ ఆర్కాట్ జిల్లా తొలి బ్రిటిష్ కలెక్టర్ స్ట్రాటన్ దొర తిరుమల విస్తీర్ణం, ఆలయ సిబ్బంది, వారి హోదా, జీతభత్యాలు, ఆలయ నిర్వహణ వ్యయం, నైవేద్యం, ఆర్జిత సేవల నిర్వహణపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. 1803 జనవరి 31న తొలిసారిగా మద్రాసు ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వానికి కలెక్టర్ స్టాటన్ దొర నివేదికను సమర్పించారు. ఆయన తర్వాత తిరుమల ఆలయ పాలన అవకతవకలపై విచారణాధికారిగా పి. బ్రూస్ నియమితులయ్యారు.


తిరుమల సందర్శించిన బ్రిటిష్ పాలకులు

**టీటీడి పాలనకు ఐదు మార్గదర్శకాలు**

1. దిట్టం, 2. కైంకర్యపట్టీ 1801-1820, 3. బ్రూస్‌కోడ్ 1821, 4. సవాల్-ఇ - జవాబ్ 1819, 5. పై మేయిషి అకౌంట్

**దిట్టం...** శ్రీవారికి నిత్యం సమర్పించే నైవేద్యం తయారీలో ముడి సరకులు ఏయే పరిమాణంలో వినియోగించాలన్నిదే దీని ముఖ్య ఉద్దేశం. ఇప్పటికీ ఆలయంలో లడ్డూలు, ప్రసాదాలు తయారీలోతోపాటు స్వామివారికి సమర్పించే పుష్పాలు కూడా దిట్టం ఆధారంగానే సరఫరా చేసి పుష్పకైంకర్యం నిర్వహిస్తున్నారు. శ్రీవారి లడ్డూ ఇప్పటికీ రుచిగా ఉండటానికి ప్రధాన కారణం దిట్టంలో పేర్కొన్న ప్రమాణాలే. **35 సం॥లు ఆలయ పాలనం చేసిన చెలికాని అన్నారావులా, ప్రస్తుత కార్య నిర్వహణాధికారి ఎల్వీ.సుబ్రహ్మణ్యం ఎంతో శ్రద్ధాసక్తులు చూపుతున్నారు.**

**కైంకర్య పట్టీ...** తిరుమల ఆలయ సిబ్బంది, పరిచారకులు, మిరాశీదారులు, జియ్యర్ సిబ్బంది విధులపై 1801, 1820 రెండు సార్లు కైంకర్యపట్టీ తయారుచేశారు. దీని ప్రకారం సిబ్బంది హోదా, విధులు, పూర్తివివరాలు ఉంటాయి. ఈ పట్టీ రికార్డులు నార్త్ ఆర్కాట్ జిల్లా కలెక్టర్, తిరుపతి తహసీల్దార్, తిరుమల ఆలయ పారుపత్తేదారు వద్ద ఉంటాయి.

**జన్మవృక్షమునకు- చవిగలయట్టి**
**పటుతర కమనీయ - ఫలములు రెండు**
**కెరలు భోగములొందు - కీర్తి రెండవది**
**తొలిపండు చవిచూసి - తొలగునొకండు**
**మలిపండు రుచిచూసి - మలగునొకండు**
**- శ్రీనాథుడు, పల్నాటి వీరచరిత్ర**

**బ్రూస్‌కోడ్..** దేవస్థానం పాలనకు మార్గదర్శకంగా బ్రూస్‌కోడ్ ఉంది. బ్రిటిష్ ప్రావిన్షియల్ జడ్జి పి. బ్రూస్ ఈస్టిండియా కోడ్ ఆఫ్ డైరెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఆలయ పరిపాలన సక్రమంగా సాగించేందుకు 1821, జూన్ 25న ప్రత్యేకంగా నియమావళిని రూపొందించారు. ఈ నియామావళిలోని మార్గదర్శక సూత్రాల ప్రకారమే పాలన సాగాలని మద్రాసు బ్రిటిష్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాటి నుండి బ్రూస్ కోడ్ అమలయ్యింది.

సవాల్- ఇ - జవాబ్.. శ్రీవారి ఆలయంలో సేవలు, సిబ్బంది విధులు, ఆలయ ఖర్చులు, ఆదాయం, తిరుమల ఇతిహాసం, చరిత్రను రికార్డులుగా నిర్వహించేందుకు ఈస్టిండియా కంపెనీ 1819లోనే ఒక వినూత్న ప్రయత్నం చేసింది. అదే ప్రశ్నలు సమాధానాలుగా రికార్డులుగా రూపొందించడం. దీన్నే సవాల్- ఇ - జవాబ్ పట్టీగా వ్యవహరిస్తున్నారు.


**మన్రో గంగాళం... శ్రీవారికి నైవేద్యంగా సమర్పించే అన్న ప్రసాదాలుపెట్టే రాగి గంగాళాన్ని 'మన్రో గంగాళం' అంటారు. ఒకప్పుడు దత్తత మండలం (నేటి రాయలసీమ) కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో అనే బ్రిటిష్ అధికారి స్వామిని దర్శించుకోవాలని తపించేవాడట. కారణం తెలియదుకాని ఆయన కోరిక మాత్రం తీరలేదని చరిత్ర. కానీ ఆయన బహూకరించిన రాగి గంగాళంలోనే నేటికీ స్వామికి నైవేద్య ప్రసాదం అందుతోంది.**



కింగ్‌జార్జ్, క్వీన్ విక్టోరియా చిత్రాలు ఉన్న 492 బంగారు నాణేలతో స్వామి వారికి హారాన్ని తెల్లదొరలు తయారు చేయించారు. ఆలయంలో మూలమూర్తికి 1972కు ముందు వరకూ వీటినే వినియోగించేవారు. ప్రస్తుతం భక్తుల నుంచి ఆభరణాలు కుప్పలు తెప్పలుగా అందుతుండటంతో పాతవాటిని టిటీడి ఖజానాలో భద్రపరిచింది. భక్తులు కానుకలు సమర్పించే హుండీ/ కొప్పెర కూడా ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో 1821 జూలై 25న ఏర్పాటు చేశారని ఆలయ పరిపాలనా విధానాలను నిర్దేశించే చట్టం బ్రూస్‌కోడ్-12 ఆధారంగా ఉంది.

**స్వామివారి ప్రసాదంగా లడ్డూను స్థిరపరచింది తెల్లదొరలే!!**

కాలినడక తప్ప మరొక మార్గం లేని శేషాచల అడవిలో తొలిసారిగా 1944 ఏప్రిల్ 10వ తేదీ తిరుమల తొలిఘాట్‌రోడ్డు ఏర్పాటై నల్లరంగు మినీ బస్సులు నడిచాయి. అప్పటి మద్రాసు ఉమ్మడి బ్రిటిషు గవర్నర్ ఆర్థర్ హూప్ నేతృత్వంలో ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేతృత్వంలో మొదటి ఘాట్‌రోడ్డు రూపుకల్పన చేసింది ఆతెల్లదొరలే! వారు ఇదంతా చేసింది ఉద్యోగధర్మంలో భాగంగానే అనుకోవచ్చు. కాని, తిరుమలేశుని భక్తి విశ్వాసాలతో కూడానన్నది అక్షర సత్యం. ●




బాపట్లలో ఆంధ్ర మహాసభలు

# ఆ స్ఫూర్తికి వందేళ్లు....

**తెలుగువాడి వాణి, తెలుగువాడి జీవ నాడి స్ఫూర్తికి ఆంధ్ర మహాసభలే ప్రధాన వేదిక. ఆంధ్రభాష, ఆంధ్ర సంస్కృతి ఆ సభల ద్వారా అభివృద్ధిలోకి వచ్చింది. ఆంధ్రోద్యమానికి ఈ సభలు ఆయువుపట్టునందని. ఈ ఆంధ్ర మహాసభలకు 1913లో బాపట్లలో అంకురార్పణ జరిగింది. వాటిస్ఫూర్తిని గుర్తు చేసుకునేందుకు అదే బాపట్లలో మహాసభల శతాబ్ది ఉత్సవాలను మే నెల 24, 25, 26 తేదీలలో నిర్వహించారు. అప్పటి ఉద్యమాన్ని, ఓమారు గుర్తు చేసుకుంటే ఆత్మస్ఫూర్తి కాలకాలాలకైన మాతృదేశ భక్తిపరులవుతాం.**

స్థానిక తెలుగు మహాసభలు, రాష్ట్ర తెలుగు మహాసభలు, రాష్ట్రేతర తెలుగు మహాసభలు, 'తానా', 'ఆటా' 'నాటా' అంటూ వేలాదిమంది ప్రతినిధులు, లక్షలాది ప్రేక్షకజనంతో తెలుగు మహాసభలు, నిన్నా, మొన్నా, నేటి వరకూ, ఇంకా ముందు కాలంలో జరుపుతున్నారు. ఇవన్నీ ఒక భయం భాష, సంస్కృతీ! సాంప్రదాయం! సంస్కారం! దేశభక్తి! దైవభక్తీ! పూర్వ పెద్దల కృషీ సంస్మరణా కృతజ్ఞతా భావంతో జరుపుతున్నారా? అన్నదో ప్రశ్న.




శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఇంటర్నెట్‌లో www.pradhamandhra.comలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందుపరుస్తున్నారు.

భాషకోసం తపించి, భాష కోసం జీవితం అర్పించిన వారి కోసమై జరుపుతున్నారా. స్వభాషాభిమానం ద్యోతక మవుతున్నదా?


ఎంత సేపూ సినిమా వారు, రాజకీయ నాయకులే కావాలి. వారి గ్రామరే ప్రధానం! సాహితీ బంధువులవసరం లేదు. అందుకే బాపట్ల ఆంధ్ర మహాసభల స్ఫూర్తిని పొందండి అంటున్నాను.

ఇంగ్లండు సహా యూరోపియన్ దేశాల్లో 18, 19 శతాబ్దాల్లో వచ్చిన పారిశ్రామిక విప్లవంతో అప్పటివరకు ఉన్న ఆర్థిక విధానం పూర్తిగా మారిపోయింది. పర్యవసానంగా దేశంలోని పరిశ్రమలు కుప్పకూలాయి. వ్యవసాయ రంగం దెబ్బతిన్నది. ఇంగ్లీషు చదువులు నేర్చిన వర్గంలోని ఓ భాగం మేధావి వర్గంగా ఎదిగి, దేశ స్వాతంత్ర్యోద్యమానికి బాటలు వేసింది. మన ఆంధ్ర ప్రాంతం అంతా మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉండేది. ఆంధ్ర రాజకీయాలను వందేమాతరం ఉద్యమం ప్రభావితం చేస్తూ ఈ ఉద్యమంతోపాటే అప్పటి మద్రాసు రాష్ట్రంలోని సర్కారు జిల్లాల్లో ఆంధ్రోద్యమానికి ఊతమిచ్చింది బాపట్లే. రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంత విస్తీర్ణం 58 శాతం. తెలుగు జనాభా 3 కోట్లు. అయినప్పటికీ తెలుగువారికి అన్ని రంగాల్లోనూ వివక్షత తప్పలేదు. ఆంధ్రులను మద్రాసీలుగా పరిగణిస్తుండేవారు. దీనితో ప్రత్యేక రాష్ట్రం ఉంటేనే ఆంధ్రకు న్యాయం జరుగుతుందని ఆంధ్రులు భావించారు.

## ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకత ప్రచారం

గుంటూరులో 1903–04 మధ్య ఏర్పాటైన యంగ్‌మెన్ లిటరరీ అసోసియేషన్ ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ప్రచారం చేసింది. 1911లో బెంగాలు విభజన జరిగాక ప్రత్యేక రాష్ట్రంపై ఆంధ్రుల కృషి ముమ్మరమైంది. ఉద్యమం కొత్త మలుపులు తిరుగుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాలకు పిలుపునిచ్చింది. జొన్నవిత్తుల గురునాథం, ఉన్నవ లక్ష్మీనారాయణ దేశంలో తెలుగు ప్రజలున్న ప్రాంతాలన్నింటినీ చిత్రపటంగా రూపొందించారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రంకావాలనే నినాదం ఢిల్లీలో 1911 డిసెంబర్ 12న బహిర్గతమైంది. అప్పట్లో మద్రాసులో ఆంధ్రా కాంగ్రెస్ సంఘం, తమిళ కాంగ్రెస్ సంఘం రెండూ పనిచేస్తుండేవి. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆందోళన చేపట్టేందుకు ఆంధ్ర కాంగ్రెస్ సంఘానికి ఇబ్బందికరం కాగలదని భావించి బహిరంగంగా ఆ నినాదాన్ని అందుకోలేదు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు అధ్యక్షుడిగా ఉన్న ఆంధ్ర మహాసభ ఈ పనిని చేపట్టి బలీకరించింది.

(తరువాయి 20వ పేజీలో)



**ప్రథమాంధ్ర మహాసభ (బాపట్ల, 1913)**

కూర్చున్నవారిలో ఎడమనుంచి రెండవవారు శ్రీ వేమవరపు రామదాసు పంతులు గారు, మూడవవారు శ్రీ పూరపాటి వెంకటపతిరాజుగారు, నాల్గవవారు శ్రీ శర్మగారు (మహాసభ అధ్యక్షుడు), ఐదవవారు సర్ మోపర్ల రామచంద్రరావు గారు, ఆరవవారు శ్రీ వెంకట రమణారెడ్డి గారు, నిలుచున్నవారిలో ఎడమ మొదటివారు శ్రీ సి.వి.నారాయణరావు

# శ్రీకాకుళంలో ఓ హోటల్‌కు లబ్ధి చేకూర్చడం కోసం రామాలయమునే కూల్చేసారు!!



జేసిబితో రామాలయాన్ని పడగొడుతున్న దృశ్యం

శ్రీరామా! పరంధామా! నీ ఆలయమునే కూల్చేసినవారుండిన ఈ గడ్డపై 'రామరాజ్యం' వెలుస్తుందనే నమ్మకమెక్కడ ఉంటుందయ్యా! విరివిగా పల్లెపల్లెనా, రామాలయములను నిర్మించి, సీతారామ ఆంజనేయ సౌమిత్రులను కొలిచిన పునీతమైన గడ్డ తెలుగుగడ్డ, సంవత్సరాది నుంచే శ్రీరామ నవరాత్రోత్సవాలను జరిపి సీతారామ కల్యాణానన్తరంగానీ, కన్నెపిల్లలకు పెళ్ళితలంబ్రాలు పోయని జాతిగా ఆంధ్రులు ఖ్యాతిగాంచారు. కష్టమేతెంచినా, సుఖమేతెంచినా, ఆశ్చర్యం కలిగినా, ఆవేదన కలిగినా, 'రామరామ'యని 'ఆర్తి'ని తీర్చుకొనే జాతి తెలుగు జాతి.

ఉత్తరాంధ్రలో అనేక క్షేత్రాలు గల భూమి శ్రీకాకుళం. అలాటి పవిత్ర పట్టణంలోని జి.టి.రోడ్డు విస్తరణకు రామలక్ష్మణుల కూడలిగా ఉన్న పురాతన రామాలయాన్ని యంత్రాలతో తొలగించేసారు. 'ఔరా' అన్నవారు లేదు. నోరారగ నొచ్చుకున్నవారు లేరు.

రోడ్డు విస్తరణకు ఎదురుగా ఎంతో ఖాళీ స్థలం ఉండగా, దాన్ని విడిచిపెట్టి, ఎదురుగా ఉన్న హోటల్ విస్తరణకు ప్రయోజనం కూర్చేలా రామాలయం కూల్చడం దారుణం కదా – యని ఎవరూ అడగలేదు, అధికారులు భావించలేదు. హిందూ విశ్వ పరిషత్తు, స్వాభిమాన్ ట్రస్టు వారు ఆగ్రహావేశాలు ప్రకటిస్తున్నారు. వారు కాషాయులు కదా! వారి మాటల్ని ఎవరూ పట్టించుకుంటారు. పట్టుకెళ్ళి జైల్లో పడేస్తారు. హైందవాన్నీ, ఆర్ష ధర్మాన్నీ కించపరచడమే నాగరికమైంది. రామా! నీవెక్కడున్నావ్ – ధనుర్బాణములు పట్టు. పరశురామా! పరశువును పట్టు! బలరామా హలము నెత్తు!

(ఆంధ్రభూమి, విజయవాడ, 2013 మార్చి 4 సోమవారం)

(19వ పేజీ తరువాయి 20వ పేజీలో)

**ప్రత్యేక ఆంధ్ర ప్రస్తావన...**

కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల సంయుక్త సమావేశాలు 1912 మేలో నిడదవోలులో వేమవరపు రామదాసు పంతులు అధ్యక్షతన జరిగాయి. ఇక్కడ ప్రత్యేక ఆంధ్ర ప్రస్తావన వచ్చింది. అఖిలాంధ్ర సమావేశంలోనే ఏ నిర్ణయమైనా తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమైంది. తర్వాత ఇందుకోసం దేశభక్త కొండా వెంకటప్పయ్యను కార్యదర్శిగా స్థాయీ సంఘాన్ని ఎన్నుకున్నారు. ఆంధ్ర మహాసభ సమావేశాలను బాపట్లలో జరిపేందుకు నిర్ణయించారు. 1913 మార్చి 14న ఆంధ్ర మహాసభ కార్యనిర్వాహక వర్గం న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షతన సమావేశమైంది. ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా కొండా వెంకటప్పయ్య, న్యాపతి సుబ్బారావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, నోరి వెంకటేశ్వర్లును కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. జిల్లా కాంగ్రెస్ మహాసభలకు బాపట్ల న్యాయవాది చోరగుడి వెంకటాద్రి ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించారు. జిల్లా కాంగ్రెస్ మహాసభ పూర్తయిన మరుసటి రోజు 1913 మే 26న ఆంధ్ర మహాసభ నిర్వహించాలని నిర్ణయించారు. సభాస్థలి అయిన ఎడ్వర్డ్ కరోనేషన్ మెమోరియల్ టౌన్‌హాలులో 26, 27న రెండు రోజులు మహాసభలు నిర్వహించారు. మహామహుల పేర్లతో రూపొందించిన 22 ద్వారాలతో అలంకరించిన హాలులో 800 మంది ప్రతినిధులు, 200 మంది ప్రజలు హాజరయ్యారు. మద్రాసు రాష్ట్ర ఎమ్మెల్సీ బయ్యా నరసింహేశ్వర శర్మ అధ్యక్షులుగా వ్యవహరించారు. దివాన్ బహద్దూర్ ముట్నూరు ఆదినారాయణ, జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, వల్లూరు సూర్యనారాయణ, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, గంటి వెంకట రామయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, 'హిందూ' వ్యవస్థాపకుడు వేమవరపు రామదాసు పంతులు, ఇండియన్ బ్యాంకు వ్యవస్థాపకుడు న్యాపతి సుబ్బారావు, గుత్తికేశవపిళ్లై, పూసపాటి వెంకటపతిరాజు, మోచర్ల రామచంద్రారావు, సీవీ నారాయణరావు, వెంకటరమణా రెడ్డి వంటి ప్రముఖులు ఎందరో పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ ఆవశ్యకతను సమర్థిస్తూ వేమవరపు రామదాసు గారు ప్రతిపాదించిన తీర్మానానికి వ్యతిరేకత ఎదురైంది. ప్రత్యేకాంధ్రకంటే దేశ స్వాతంత్ర్యం ముఖ్యమనే భావనతో కొందరు తీర్మానాన్ని వ్యతిరేకించారు. వాదోపవాదాలు జరిగాయి. ఏడాదిపాటు ఆంధ్రరాష్ట్ర నిర్మాణ ఆవశ్యకతను దేశమంతా ప్రచారం చేసి తర్వాత తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని కొండా వెంకటప్పయ్య సలహానిచ్చారు. మూడుగంటల చర్చల అనంతరం ఇందుకనుగుణంగా తీర్మానం ఆమోదించారు. బాపట్ల మహాసభ అనంతరం క్రమం తప్పకుండా ఏటా ఆంధ్రమహాసభలు దేశవ్యాప్తంగా గల తెలుగువారు నిర్వహించారు. రంగూన్, దక్షిణాఫ్రికాలోనూ అక్కడి తెలుగువారు సభలు జరుపుకొని మాతృభాషపై మమకారాన్ని చాటారు. కానీ ఆనాటి తెలుగు సభలు డప్పులూ ఢమరుకాలు వాయించేవి కావు. నిర్మాణాత్మక విధానాలు చర్చించేవి. ●

## పత్రికల్లో ప్రత్యేకాంధ్రవాణి

ఆంధ్రోద్యమానికి పత్రికలూ, పుస్తకాలూ తోడ్పడ్డాయి. 1908లో బొంబాయి నుంచి కాశీనాథుని నాగేశ్వరరావు సారథ్యంలో 'ఆంధ్రపత్రిక', ముట్నూరి కృష్ణారావు నేతృత్వంలో బందరు నుండి 'కృష్ణాపత్రిక' వెలువడటం ఈ ఉద్యమానికి దోహదం చేశాయి. 1910లో విజ్ఞాన చంద్రికా మండలి ఆంధ్రుల చరిత్ర అనే పుస్తకాన్ని ప్రచురించి తెలుగువారికి చరిత్రను, పూర్వ వైభవాన్ని గుర్తు చేసింది. అఖిలాంధ్ర సమావేశం నిర్వహణకు ఏర్పాటు చేసిన స్థాయీ సంఘానికి కార్యదర్శిగా ఎన్నికైన కొండా వెంకటప్పయ్య, 'ఆంధ్రోద్యమం' పుస్తకాన్ని ప్రచురించగా, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు కలిసి 'ఆంధ్రరాష్ట్రము' పుస్తకాన్ని రచించారు. 1912లో కొమర్రాజు లక్ష్మణరావు 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' ప్రచురణ కూడా ఆంధ్రుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించింది. నూతన రాష్ట్రం ఏర్పాటయితే గవర్నర్ కార్యవర్గం, హైకోర్టు న్యాయమూర్తులు, రెవిన్యూ బోర్డు సభ్యులుగా వ్యవహరించేందుకు తగిన ఆంధ్రులు అనేకమంది ఉన్నారని 1912 అక్టోబరు 9న 'దేశమాత' పత్రిక పేర్కొంది. ప్రత్యేకాంధ్ర ఆచరణ యోగ్యమని 1912 నవంబరు 12న 'ధర్మప్రకాశిక' ప్రకటించింది.

# ఆంధ్రా పారిస్ అందాల్లో లోహయుగపు గుబాళింపులు




**తెనాలి ఉనికి ఈనాటిది కాదు. జనాల, జినాలి, తేరాలి, తెరవలి వంటి పలు రూపాల నుంచి 11వ శతాబ్దంలో దావులూరి శాసనంలో తెనాలి పేరు స్థిరపడింది. అయితే తెనాలి ఉనికి, నాగరికత, సంస్కృతి క్రీస్తు పూర్వం 10 వేల సంవత్సరాల నాటి సుమేరియన్ల ప్రభావం కలిగి వుందని భారత పురావస్తు శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ (రిటైర్డ్) డాక్టర్ పురాణం రాధాకృష్ణ ప్రసాద్ తన పరిశోధనలో రుజువు చేశారు. అతి ప్రాచీన చరిత్రకల తెనాలి విషయ వివరణ సంక్షిప్తంగా-**

సంచార జీవనం నుంచి మానవుడు సంస్కృతిని సంతరించుకుంటున్న తరుణంలో కృష్ణానది పరివాహక ప్రాంతంతో అనేక మానవ ఆవాసాలు ఏర్పడ్డాయ్. అవి పల్లెలుగా, రూపుదిద్దుకుని, నాగరిక కేంద్రాలుగా ఆవిర్భవించాయి. లోహయుగపు సంస్కృతి శీఘ్రగతిన దేశ ప్రగతిని మార్చివేయడమే ఇందుకు మూలం. ఇలాంటి స్థితిలో తీరాంధ్రంలో ఆంధ్రజనపదం ఒకటి ఏర్పడి అభివృద్ధి చెందింది. అనేక నాగరిక కేంద్రాలు, పట్టణాలు వెలసిల్లాయి. ఆ క్రమంలో ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ధాన్యకటకం, చేబ్రోలు, భట్టిప్రోలు, ధనదపురంగా పిలిచిన నేటి చందోలు అప్పటి నాగరిక కేంద్రాలుగా ఉండేవి. వీటి మధ్యస్తంలో తెనాలి వుంది. ప్రాచీన తెనాలి గ్రామానికి పశ్చిమ హద్దు నేటి రామలింగేశ్వరాలయం. తూర్పున నేడున్న గ్రామకచేరి చావడి, దక్షిణాన మెయిన్‌రోడ్డు, ఉత్తరాన అయితానగర్ వెళ్లే దారిలోని చెరువు హద్దులుగా వున్నాయి. ఇవే గ్రామకంఠం హద్దులు. ఈ హద్దుల లోపలి ప్రాచీన గ్రామమే ఒకనాటి తెనాలి. గ్రామానికి తూర్పు ఈశాన్య ప్రాంతంలో శివరాధకులు, జంగాలు ఉపయోగించే శ్మశాన భూమి, పశ్చిమంగా శివాలయానికి ఎదురుగా గ్రామ శ్మశానం, దక్షిణంగా నేడున్న ఏరియా ఆస్పత్రి స్థలంలో అప్పట్లో గొల్లపాలెంగా పిలుచుకునే ప్రాంతం వుండేవి. మిగతా పట్టణమంతా 20 వ శతాబ్దంలో వచ్చిన అభివృద్ధి చెందినదే! ప్రాచీన తెనాలికి సంబంధించి నేడు మిగిలి వున్న దిబ్బమీదనే గోవర్ధనస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలున్నాయి. జైన దేవాలయం నుంచి తూర్పుగా వెళ్లే వీధి, ఇళ్లు కూడా ప్రాచీన శిథిలాలపైనే వున్నాయి. గోవర్ధనస్వామి ఆలయ ప్రాంతం ప్రాచీన తెనాలి గ్రామ నడిబొడ్డు. ఈ ఆలయానికి వాయవ్యంగా గోపాలస్వామి ఆలయం 17వ శతాబ్దంలో నిర్మించారు. గ్రామదేవత అక్కడే వున్న పోతరాజై వుంటాడనే అభిప్రాయం వుంది. అయితానగర్ నుంచి నేటి గాంధీ చౌక్‌కు వచ్చే మార్గమే ఆ నాటి గ్రామమధ్యలోని రహదారి అయివుండొచ్చు. ప్రాచీన స్థలచరిత్ర అనుసరించి రామలింగేశ్వరాలయం ప్రాచీనం. పరశురామ ప్రతిష్టితం అని చెబుతారు. తెనాలికి సబంధించిన స్థల చరిత్ర లేక కైఫీయతు వల్ల కొన్ని విషయాలు తెలుస్తాయి. తెనాలి చరిత్ర 19వ శతాబ్ది ప్రారంభంలోనే క్రోడీకరించి లిఖితమైంది. అమరావతి ప్రభువైన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుని కాలంలో కల్నల్ మెకంజీ ద్వారా సేకరించి భద్రపరిచారు. తెనాలి పేరుతో ప్రసిద్ధి చెందిన గ్రామం దావులూరు. వెలనాటి మొదటి రాజేంద్రచోళుని కాలానికి చెందిన శక సంవత్సరం 1065 (క్రీశ 1143) నాటి దావులూరులోని గోకేశ్వర దేవరకిచ్చిన దానశాసనంలో నాటి గ్రామానికి ఎట్టి మార్పులు చేర్పులు లేక ఆనాటి నుంచి తెనాలిగా నేటికీ తెలుస్తుంది. మెకంజీ కైఫీయతు ప్రకారం తొలుత ఈ గ్రామం శాతవాహనుల పాలనలో వుండి తర్వాత ముక్కంటి (పల్లవుడు) పాలనలో, తర్వాత చోళదేశాధిపతుల రాజ్యంలోను వుంది. అనంతరం గజపతి రాజుల పాలనలో వారి ప్రధానులైన గోపరాజు రామన్న సమస్తమైన నియోగులకు గ్రామకరణీకం మిరాశీలు నిర్ణయించే సందర్భంలో తెనాలికి యజుశ్శాఖాధ్యాయి, ఆపస్తంభ సూత్రాలు, భారద్వాజస గోత్రులు అయిన తురగా వెంకన్న అనే ఆరువేల నియోగికి మిరాశీ నిర్ణయించారు. తదుపరి కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు కాలంలో (క్రీశ 1295-1325) తమ గురువైన ముదిగొండ శివయోగీశ్వర అయ్యవార్లను రప్పించి, వారికి ముదిగొండ పరగణాను జాగీరుగా ఇప్పించారని కైఫీయతు ప్రకారం తెలుస్తుంది. వరంగల్ జిల్లాలో చాణుక్యుల పాలనలో వున్న ముదిగొండ పరగణాలో కాలాంతరంలో కష్టాలు ఎదురుకావడం తెలుసుకుని చక్రవర్తి ఆయనను వెంటబెట్టుకుని తాము తెనాలి ప్రాంతానికి వచ్చేటపుడు తీసుకుని వచ్చారు. తెనాలిలోని శ్రీరామలింగేశ్వర స్వామివారికి స్థానాచార్యులుగా నియమించి గృహాలు కట్టించి తెనాలిలో స్థిరనివాసం కల్పించారు. క్రీశ 14వ శతాబ్ది ప్రారంభంలో జరిగి వుంటుందని అంచనా. రామలింగేశ్వర స్వామి ఆలయానికి నైరుతి దిశలో నేడున్న ఆరాధ్యుల బజారే ఆనాడు శివయోగీశ్వర అయ్యవారికి కేటాయించిన ఇండ్ల వీధి అయివుంటుందనే భావన వుంది. ముదిగొండవారి సంతతి, శ్రీపతి పండితారాధ్య దేశిక సంప్రదాయానికి చెందిన శివయోగీశ్వరులూ గురువులుగా ఈనాటికి వున్నారు. అటు తర్వాత వచ్చిన రెడ్డిరాజుల పాలనలో తెనాలి గ్రామం తాలూకు కొంతపొలాన్ని నందులవారు, మొదలైన బ్రాహ్మణులకు వృత్తిమాన్యంగా ఇచ్చారు. ఆనాడు మజుతూరి కులకరణి, తురకా నర్సరాజు, నేటి తురగావారు వారి వంశీయులే అయివుండాలి.

శాలివాహన శకం 1411 (క్రీశ 1489).లో సౌమ్యనామ సంవత్సర వైశాఖ శుద్ధ ఏకాదశినాడు జగన్నాధ వల్లభుడనే పద్మశాలీయునికి గోవర్ధన స్వామి కలలో కనిపించి గ్రామానికి ఉత్తర దిశగా పాలచెట్టుకింద తాను వున్నానని, అది గుర్తించి ఒక ఆలయాన్ని నిర్మించి ఉత్సవాలు జరిపించమని ఆనతిచ్చినట్టు శాసనం ద్వారా తెలుస్తున్నది.

వల్లభుడు గ్రామానికి ఉత్తర భాగంలో పాలచెట్టు దగ్గర ఆలయం కట్టించి స్వామిని ప్రతిష్టించి ఉత్సవాలు జరిపించారు. ఆనాటి కరణాలు తూరమంత్రి కులజులు శింగనార్యుడు మొదలైనవారు స్వామివారినే తమ కులదైవంగా భావించి ఆరాధించేవారు. రెడ్డి రాజుల పాలన అనంతరం ఈ ప్రాంతం విజయనగర రాజుల పాలన కిందకు వచ్చింది. వీరిలో శ్రీకృష్ణదేవ రాయులు ప్రసిద్ధుడైన విషయం తెలిసిందే. పండితుడు, కవి గ్రంథకర్త అయిన ఈ ప్రభువు ఆస్థానంలో వున్న తెనాలి రామకృష్ణ కవి తెనాలివాసి కావడం విశేషం. సత్తెనపల్లి తాలూకాలోని గార్లెపాడు గ్రామం రామకృష్ణుని స్వస్థలం. తొలుత రామలింగంగా పిలువబడినా తర్వాత లింగాధారి ఆరాధ్యుడై రాయల ఆస్థానంలో చేరాక వైష్ణవ మత ప్రభావితుడై, రామకృష్ణకవిగా పేరొందినట్టు పండితుల అభిప్రాయం. తెనాలి గ్రామాన్ని విజయనగర ప్రభువులనుంచి అగ్రహారంగా పొందారాయన. జగన్నాధ పండిత రాయలు కూడా తెనాలివాసే అన్నది మరో అభిప్రాయం. విజయనగర పతనానంతరం గోల్కొండ నవాబుల పరిపాలనలో కొండవీడుకు ముర్తుజాఖాన్ రాజప్రతినిధిగా నియమించారు. ముర్తుజాఖాన్ కొండవీటి సీమను ముర్తుజానగర్‌గా పేరు మార్చి 14 సమితులుగా విభజించి పాలించారు. వీటిలో కూచిపూడి సమితి ఒకటి. తెనాలి గ్రామం ఆనాడు కూచిపూడి సమితిలో వుండేది. అప్పట్లో తెనాలి ప్రాంత గ్రామాలకు ముస్లింలను కరణాలుగా నియమించారు. అదే సమయంలో హయత్‌నగర్ (నేటి అయితానగర్ అని అభిప్రాయం) ప్రతినిధిగా నియమితులైన హయత్ ఖాన్ తెనాలి ప్రాంతంలో ఇస్లాం మత వ్యాప్తికి దోహదపడినట్లు చెప్పుకుంటున్నారు. 1578 నాటికే ముస్లిం లున్న తెనాలి ప్రాంతంలో ఇస్లాం మతాన్ని అధిక సంఖ్యాకులు స్వీకరించారు. నేటి గుంటూరుజిల్లా ఏరియాను 1752-58 వరకు ఫ్రెంచివారు, బసాలత్ జంగ్‌లు పాలించారు. నిజాం నవాబులు ఏలుబడిలో జమీం



దారులను కప్పం వసూలు చేసే అధికారాన్ని కల్పించారు. తెనాలి అప్పట్లో వాసిరెడ్డి జమీందారు కింద వుండేది. 1782 నుంచి బ్రిటిష్ పాలకుల రాజ్యం ఏర్పడింది. 1788 సెప్టెంబరులో గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలిస్ హయాంలో ఈస్ట్ ఇండియా కంపెనీ, దరిమిలా బ్రిటిష్ ప్రభుత్వపరమైన కొండవీడు, చిలకలూరిపేట జమీందారుల పరంకాగా తెనాలి ప్రాంతం వాసిరెడ్డివారికి దక్కినట్లు కైఫీయతులో ఉంది. బ్రిటిష్ పాలనలో వున్న కాలంలోనే తెనాలిలో పిల్లలమర్రి, మతుకుమల్లి పండిత వంశాలు తెనాలి ప్రతిష్టను ఇనుమడింపజేశాయి. వేదాధ్యయంనలో పేరెన్నికగన్న పిల్లల మర్రి వంశానికి చెందిన పొన్న సోమయాజులు వాసిరెడ్డి పెదరామలింగన్న నుంచి అగ్రహారాన్ని పొందారు. పిల్లమర్రి పూర్ణయ్య సిద్ధాంతి సిద్ధాంత, జ్యోతిష్య శాస్త్రాల్లో దిట్ట. ప్రామాణికుడు. ఆగమ, ఖగోళ శాస్త్రాల్లో కూడా పండితుడే!

ఈ రెండు సిద్ధాంతాలను సమన్వయపరిచి నూతన గణిత విధానాన్ని వివరిస్తూ జ్యోతిస్సిద్ధాన్త సంగ్రహం అనే ప్రామాణిక గ్రంథాన్ని (1889)లో రచించారు. పిల్లలమర్రి ఆంజనేయులు ప్రముఖ న్యాయవాది. మద్రాస్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తెనాలి తాలూకా నుంచి స్వరాజ్యవాదుల తరఫున ఎన్నికైన ప్రతినిథి. తెనాలి మునిసిపల్ చైర్మన్‌గా పనిచేశారు. రెండవదైన మతుకుమల్లి కుటుంబంలో ప్రసిద్ధికెక్కిన కవులు, వేదాంతులు, తాపసులు, ఆమాత్యులే వున్నారు. ఇలా తెనాలి అతి ప్రాచీన కాలంలో కూడా అదే పేరుతో కొనసాగింది. కృష్ణా పరివాహక ప్రాంతంలో కృష్ణా నదిపాయపై వున్నందున బహుప్రాచీన కాలం నుంచి జనావాసమైంది. అత్యంత ప్రాచీనమైన సుమేరియన్ సంస్కృతి ప్రభావం కలిగిన గ్రామనామంతోనూ కొనసాగుతూ నేటి రూపాన్ని సంతరించుకుంది. నాటి ప్రాచీన శిథిలాలపైనే నేటి తెనాలి అభివృద్ధి చెందినందున భూగర్భంలోని సంస్కృతీ సంపద తెలియదు. మల్లెపాడు కీపూ 5వ శతాబ్దిలో ప్రారంభమైతే తెనాలి అంతకు పూర్వమే పుట్టింది. పక్కనున్న నేటి అయితానగర్‌లో ప్రాచీన సంస్కృతీ సంపద వెలుగులోకి వచ్చిన దాఖలాలు లేవు. నేటి నాగరిక గ్రామాలు అక్కడ వున్నందున భవిష్యత్‌లో లభించే అవకాశాలు కూడా లేవంటారు. తెనాలి అభివృద్ధి 20 శతాబ్దంలోనే వేగంగా జరిగింది. 1794లో గుంటూరు జిల్లాను కృష్ణాజిల్లాలో చేర్చడంతో తెనాలి కూడా ఆ జిల్లాలో భాగమైంది. 1904లో మళ్లీ గుంటూరు జిల్లాను వేరు చేశారు. ఈ సందర్భంగా తెనాలి 1901 వరకు రేపల్లె తాలూకాలో వుంది. 1901లో తెనాలి కేంద్రం చేసి రేపల్లెలో కలిపారు. 1909 అక్టోబర్ ఒకటిన తెనాలి మునిసిపాలిటీగా ఆవిర్భవించింది. 1911లో తెనాలి కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటైంది. 1933లో బాపట్ల తాలూకాలో వున్న ఏడుగ్రామాలు (వడ్లమూడి, పెనుగుదురుపాడు, చేబ్రోలు, పాతరెడ్డిపాలెం, కొత్తపల్లి నారికేళపల్లి, మంచాళ అగ్రహారం, శ్రీరాంపురం అగ్రహారాలను తెనాలి తాలూకాలోకి మార్చారు. 1898లో మద్రాసు – విజయవాడ రైలు మార్గాన్ని ఏర్పాటు చేశారు. తెనాలిని కలుపుతూ గుంటూరు – రేపల్లె రైలుమార్గం 1916లో ప్రారంభమైంది. 1889లో లోకల్‌బాడీస్ కింద తెనాలిలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలను ప్రారంభించారు. తర్వాత తెనాలి మునిసిపాలిటీకి అప్పగించారు. 1928లో ప్రభుత్వ స్వాధీనంలోకి వచ్చింది. 1911 వరకు గుంటూరు జిల్లాలో స్థాపించిన 13 సెకండరీ పాఠశాల్లో మూడు పాఠశాలలు (కొల్లూరు– 1888, తెనాలి– 1903, తురుమెళ్ల–1911లో తెనాలి తాలూకాలోనే వున్నాయి. 1911లో తెనాలిలో జిల్లా అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఏర్పాటై 1933లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుగా మారింది. 1928లో ఇక్కడ ఆయుర్వేదిక్ వెటర్నరీ కాలేజీ వుంది. తెనాలి ప్రసిద్ధిగొన్న సాహితీవేత్తలకూ, సినిమా నాటక కళాకారులకు, రచయితల నిలయం. సుప్రసిద్ధ అందాల తార కాంచనమాల సినిమా రంగాన్ని ఓ మలుపు తిప్పింది. చక్రపాణి, లక్ష్మీరాజ్యం వంటి ఎందరో సినిమా వారు ఇక్కణ్ణుంచే వచ్చారు. ఆంధ్రా పారిస్‌గా తెనాలికెంతో పేరున్న ప్రాచీన పట్టణం.

# తెనాలికి ఖ్యాతి తెచ్చిన రామలింగకవి



తెనాలి అనగానే మొదట స్ఫురించేది తెనాలి రామలింగకవి. తెనాలి నివాసి. తెనాలి గ్రామాన్ని అగ్రహారంగా పొందారు. వీరి తాత తండ్రులు గార్లపాటి పురవాసులు. కౌండిన్యస గోత్రజులు. శుక్లయజిశ్శాఖీయులు. రామలింగకవి తండ్రి రామయ పండితులు. శైవాచారపరాయణులు. వీరు తెనాలి వచ్చి స్థిరపడినట్టు తెలుస్తుంది. తెనాలి రామలింగేశ్వరా లయంలో స్వామివారికి, అమ్మవారికి కూడ ఉత్సవ మూర్తులను తయారు చేయించి ఇచ్చినట్టు ఉత్సవ విగ్రహాల్లో స్వామివారి విగ్రహపీఠం వద్దనున్న లేఖనాధారంగా చెబుతారు.

**శ్రీతెనాలి నగరే వ్యరాయ! ర్గార్లపాటి పురరామపండిత!**
**శుక్ల మాఘసిత పంచమీ గురౌ! రామలింగముమయోత్సవాకృతిమ్!!**

ఉమాసహిత రామలింగస్వామివారి ఉత్సవమూర్తులను శుక్రనామ సంవత్సర మాఘశుద్ధ పంచమీ గురువారం అంటే క్రీ.శ. 1510 జనవరి 17వ తేదీన గార్లపాటి పురవాసి రామపండితులు ఆలయానికి సమర్పించారని దీని భావం. రామయ పండితుడు ఆనాటికే తెనాలిలో నివసిస్తున్నా ఇంకా గార్లపాటి పురవాసులుగానే వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇది సత్తెనపల్లి తాలూకాలోని లక్కరాజు గార్లపాడు కావచ్చునని అభిప్రాయం.

రామలింగేశ్వరస్వామి భక్తులై తన జ్యేష్ఠపుత్రునకు రామలింగం అని పేరుపెట్టుకున్నారు. రామలింగం కూడా తాను "రామేశ్వరస్వామి రమణీయ కరుణా విశేష పోషిత విలసిత సమగ్ర సాహిత్య మాధోరీ సంయవాత్ముడ"ని తన పాండురంగ మహత్మ్యం కావ్యంలోచెప్పుకున్నారు. వీరి సోదరుడు అన్నయ్య తన సుదక్షిణా పరిణయాశ్వాసాంత గద్యంలో "శ్రీమత్తెనాలి రామేశ్వర శాశ్వత కృపాకటాక్ష లక్షిత కవితాభిరాముడ"నని రాసుకున్నారు. రెండవ సోదరుడు శ్రీగిరి శ్రీశైల మహాత్మ్యమను శైవగ్రంథాన్ని రచించారు.

రామలింగడు కూడా తొలుత ఉద్భటారాధ్య చరిత్రము రాశారు. దీనినాధారంగా వీరందరు సహజ శైవాచార పరాయణులని తెలుస్తుంది. తెనాలిలోని శ్రీరామలింగేశ్వరస్వామి భక్తులు. రామపండితుని కాలం నుండి అనగా 16వ శతాబ్ది ప్రారంభం నుండి వీరు తెనాలి నివాసులు. ఈ మధ్య కొన్ని దశాబ్దాల కిందట రామలింగేశ్వరాలయ ధ్వజస్తంభ సమీపంలో మరమ్మతులు చేస్తుండగా పునాదుల లోతులో అష్టభుజమూర్తి దుర్గ శిలావిగ్రహం లభించింది. నేడు దానిని ఆలయానికి వాయవ్య దిశలో నిర్మించిన మండపంలో జైన తీర్థంకరుని విగ్రహం పక్కన వుంచారు. మూర్తి శాస్త్ర విధానాన్ని అనుసరించి ఇది మధ్య శతాబ్దాల నాటిదిగా చెబుతారు. బహుశ రామలింగం ఉపాసించిన దేవతా విగ్రహం ఇదేనేమోనని స్థానికుల అభిప్రాయం.

రామలింగకవి రామేశ్వరస్వామి కరుణా విశేషం వల్ల కలిగిన పాండితీ ప్రతిభ కలవాడినని చెప్పుకున్నా, దుర్గాదేవి కటాక్ష వీక్షణంతో వికటకవి, చతురకవిగా లబ్ధప్రతిష్టుడైనట్టు నానుడి కలదు. రామలింగడు పిన్నవయసులోనే రాజాశ్రయం కోసం కొండవీటి పాలకుడు నాదెండ్ల గోపమంత్రికి రాజ కార్య నిర్వాహకుడైన ఊరదేవయ్య మంత్రిని ఆశ్రయించారు.

ఆయన కోరిక ప్రకారం ఉద్భటాచార్య చరిత్రను రచించి అంకితమిచ్చారు. ఈ సందర్భంలోనో లేక తర్వాతనో గోపమంత్రి నుంచి తెనాలి అగ్రహారాన్ని పొందివుంటాడని భావిస్తారు. ఆకాలంలోనే గోపయ మంత్రి బంధువైన చిట్టలరుసు మంత్రికి తాను రచించిన కందర్పకేతు విలాసమను రెండవ కావ్యాన్ని అంకితమిచ్చారు. కొండవీటి పాలకుల ద్వారా విజయనగర రాజాస్థాన ప్రవేశం ఆశించి అప్రయత్నంగా భట్టరు చిక్కాచార్యుల శిష్యుడై వైష్ణవమును స్వీకరించి రామకృష్ణుడనే పేరుతో హరిలీలా విలాసం అనే వైష్ణవ ప్రచారాన్ని రాశారు. విజయనగరాన్ని చేరేటప్పటికి 30 సంవత్సరాల వయసు వుండొచ్చు. అయితే, రాజాస్థాన ప్రవేశం లభించిందా? లేదా అనేది సందేహాస్పదం. రాజాస్థానంలో ప్రవేశించినట్టు అంగీకరించినా అష్టదిగ్గజాల్లోని వారు కాదని చెప్పొచ్చని ప్రముఖ పురావస్తు పరిశోధకులు డాక్టర్ పి.ఆర్.కె. ప్రసాద్ చెప్తారు. అయితే విజయనగర ఆస్థానంలోనే తన నాల్గవ కావ్యం పాండురంగమహత్మ్యం రచనకు శ్రీకారం చుట్టారు. ఈలోగా 1529 చివర్లో శ్రీకృష్ణదేవరాయలు కాలం చేశారు. మళ్లీ దేశ సంచారి అయిన రామకృష్ణుడు తన కావ్యాన్ని పూర్తి చేసి 1550 ప్రాంతంలో నెల్లూరు సమీపంలోని విరూరి గ్రామనివాసి వేదాద్రి మంత్రికి అంకితమిచ్చారు.

తర్వాత దక్షిణానికి వెళ్లి ఆర్కాటు ప్రాంతంలో షోళింగరు క్షేత్రంలోని యోగనరసింహస్వామిని దర్శించి చంద్రగిరి ఆస్థానంలో చివరికాలంలో గడిపి ఉంటారని డాక్టర్ ప్రసాద్ అభిప్రాయం. రామకృష్ణుని తుది రచన ఘటికాచల మహాత్మ్యం. షోళింగరులోని ప్రధాన దైవమైన యోగనరసింహస్వామిపై చేసిన రచన ఇది. చంద్రగిరి కోటలో నేడున్న రాజమహలు ఎదురుగా రోడ్డునానుకుని దక్షిణంలో వున్న శిథిలగృహాన్ని రామకృష్ణుని నివాసంగా స్థానికులు పరిగణిస్తారు. నేటికినీ చంద్రగిరి ప్రాంతంలో తెనాలి ఇంటిపేరు కలిగిన కౌండిన్యస గోత్రీకులు, శుక్ల యజుశ్శాఖీయులు వున్నారు. ఇది రామకృష్ణునికి సంబంధించిన చరిత్ర.

నా అనుభవసారం :

# రెండు విధాల సార్థక నామధేయం ప్రముఖాంధ్ర!

*సహృదయ మనస్కులు సర్వ (లక్షణం)లలోని సౌజన్యతనే దర్శిస్తారు. ఇందులకు వ్యాసులవారి 'మహాభారతం'లోని ధర్మరాజు పాత్రనే సోదోహరణంగా చెప్పుకోవాలి. లోకంలోని మనుజులను గురించి తెలుసుకోవాలని ప్రశ్నించినప్పుడు నాకందరూ మంచి మనుష్యులుగానే కనిపిస్తున్నారనే సమా ధానం యిచ్చాడు ధర్మజుడు. అలాటి ప్రశ్ననే మనఃతత్వవేత్త, శాంతమూర్తి యైన సోక్రటీసును ప్రశ్నించినప్పుడు – అందరూ తమలో ఎంత మంచి ఉన్నదో చూచుకుంటారు. నేను ఎదుటివారిలో ఉన్న మంచినీ, నాలో ఉన్న దోషాల్ను చూచుకుంటానని చెప్పారు. అంతటి ఉన్నత మనఃస్తత్వాన్ని కల మహామనిషి మాన్యశ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి మహోదయులు. ఇక్కారణంగానే మామధ్య సౌజన్య సన్నిహితం శుక్లపక్ష శశాంకుని వెల్తురులా వృద్ధి పొందుతుందనడానికి ఈ లేఖ ప్రత్యక్ష నిదర్శనం. సం॥*


మాన్యశ్రీ గొటేటి శ్రీరామారావుగారికి హృదయపూర్వక వందనాలతో, అభినందనాలతో వ్రాసుకునే ఆనంద లేఖ.

ఏ నెలకానెల ప్రముఖాంధ్రను నిత్య నూతన సౌందర్యంతో నింపే అపూర్వ చాతురి మీకే వుందనటంలో ఆవగింజంత గూడా అతిశయోక్తి లేదు. ఈ తరంలో ఎవరికీ తెలియని వెనుకటి తరాల హేమాహేమీల పరిచయంతోపాటు, ఇప్పటికీ పొరుగు రాష్ట్రాలలో నివసిస్తూ, తమ ఆంధ్ర సంస్కృతీ వైభవాన్ని నిలబెట్టుకుంటున్న ప్రముఖులను గురించి వ్రాయటంలో మీకు మీరే సాటి.

చెన్నై నగరం ఒకప్పుడు తెలుగు సంస్కృతీ వికాసానికి కేంద్ర బిందువుగా వుండేది. ఆంధ్రరాష్ట్రావతరణ తరువాత, తెలుగు సినీ రంగం హైదరాబాదుకు తరలివెళ్ళిపోయిన తరువాత, చెన్నై నగరంలో తెలుగు ఒరవడి తగ్గినా, ఒకనాటి తెలుగు వ్యాపారస్థులు, దాతలు, సాంస్కృతిక సేవాకర్తలు వందలాదిగా చెన్నైలోనే మిగిలిపోయి ఉన్నారు. అలాంటి వారందరికీ కేంద్ర బిందువుగా పనిచేస్తోంది ప్రముఖాంధ్ర.

దీన్ని మించిన ఘనత మరొకటి వుంది. ఈనాడు మలేషియా వంటి దేశాలలో మాత్రమే గాక, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో గూడా వివిధ రీతులలో తెలుగు సంఘాలు విస్తరిస్తున్నాయి. ఎందరెందరో తల్లి తండ్రులు అక్కడ వుండి అక్కడి విద్యనే అభ్యసిస్తున్న తమ పిల్లలకు తెలుగు సంగీతంలోనూ, తెలుగు నృత్యంలోనూ, తెలుగు లలిత కళలలోనూ అద్భుతమైన శిక్షణ ఇప్పించుకుంటున్నారు. అలాంటి దేశేతర తెలుగు ప్రాంతాలన్నింటినీ అనుసంధానం చేస్తున్న ఘనత ప్రముఖాంధ్రకు దక్కుతుంది.

ఖండ ఖండాంతరాలలో చెల్లా చెదురుగా వున్న తెలుగు ప్రాంతాలను తెలుగు సంస్కృతితో అనుసంధానంచేయటం ఒక ఎత్తు. సొంత తండ్రి తాతలనే మరచిపోతున్న యీ శరవేగ సంస్కృతీ ప్రస్థానంలో తరతరాల



తెలుగు మహనీయుల గూర్చి గుండెలకు హత్తుకునే లాగా తాతతాతల నాటి గాథలను తవ్విపోయడం ప్రముఖాంధ్రకు ప్రముఖాంధ్రే సాటి.

శ్రీగోటేటివారు ఆరు దశాబ్దాలకు పైగా పత్రికారంగంలోను, కళారంగంలోను, సాహిత్య రంగంలోను, సినీ రంగంలోను, ఆధ్యాత్మిక రంగంలోను గూడా తలమునకలుగా తలపండినవారు గనుక, వారు ఏనాటి కథ చెప్పినా, ఏ మేటి పరిచయం చేసినా, ఏ సన్నివేశాన్ని వివరించినా, అవి తను ప్రత్యక్షంగా అనుభవించిన సన్నివేశాల పరంపర లాగే వుంటాయి తప్పితే, ఏవో వినికిడి కథనాలన్నట్లుగా వుండవు.

అంతేగాక శ్రీగోటేటివారు పరిచయం చేసే వ్యక్తులలో పండి తులూ వుంటారు. వ్యాపారవేత్తలూ వుంటారు. నటీనటులూ వుంటారు. దాతలూ వుంటారు, ఆధ్మాత్మిక సాధకులూ వుంటారు. వాగ్గేయ కారులూ వుంటారు, క్రీడాకారులూ వుంటారు, దేశభక్తులూ వుంటారు. రాజకీయ దురంధరులూ వుంటారు. ఇంకా ఎందరెందరో వుంటారు. వీరిలో ఎవర్ని పరిచయం చేసినా, శ్రీరామారావుగారు, వారితో తనకు గల పరిచయాన్ని బట్టి ఫస్ట్‌హ్యాండ్ ఇన్ఫర్మేషనే ఇస్తారు గానీ 'అల్లాగుట ఇల్లాగుట' అంటూ టకారాలతో సెకండ్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ ఇవ్వరు.

సామాన్యంగా ప్రముఖులను మాత్రమే ఈ ప్రముఖాంధ్ర తన పాఠకులకు పరిచయం చేస్తూ వుంటుంది. కానీ ఒక్కసారి కొందరు ప్రముఖాంధ్రవల్ల ప్రముఖులవుతూ వుంటారు. దానికి ఉదాహరణ నేనే! నేను I-SERVE సంస్థ ద్వారా చేస్తున్న పురాతన భారతీయ విజ్ఞాన శాఖల పునరుద్ధరణ కృషీకరించి సమ్మగ్ధులైవారు – ఐ– సర్వ్ సంస్థ గురించి, దాని కృషి గురించి ఇప్పటికి రెండు వ్యాసాలు తమంత తాముగా ప్రకటించారు. అది చదివి కొందరు మరిన్ని వివరాలు కావాలని నాకు వ్రాసారు. అలాంటి వారందరికీ నా విన్నపం ఒక్కటే. www. serveveda.org అనే మా వెబ్‌సైటుని చూడండి!

కాగా ప్రముఖాంధ్ర అనే పేరు రెండు విధాలుగాను సార్థకం– అది ప్రముఖులను పరిచయం చేస్తుంది. తన రచనల ద్వారా తగినవారిని ప్రముఖులనూ చేస్తుంది. ఎనభై సంవత్సరాలు దాటిన పరిణత వయస్సులో ఇంతటి పరిణత ప్రజ్ఞతో ప్రముఖాంధ్ర పత్రికను ప్రపంచంలో ప్రముఖ స్థానంలో నిలబెడుతున్న శ్రీగోటేటి శ్రీరామారావుగారికి ఇతోధికంగా ఆయురారోగ్యైశ్వర సామర్థ్యాలను అనుగ్రహించవలసిందిగా ఏడుకొండల వేంకటేశ్వరుని మనసారా ప్రార్థిస్తున్నాను.

**– కుప్పా వేంకట కృష్ణమూర్తి**


Compliments from

Sri Krishna Bhat

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE
Ring Road, Tirumala. Ph : 517504

HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464


## మరో మహితాత్ముని లేఖ

**శ్రీగోటేటి శ్రీరామారావుగారికి నమస్కారములు.**

తాము ప్రేమతో నా గూర్చి ప్రముఖాంధ్రలో ప్రచురించిన మార్చి మాసం ప్రతిచేరింది. చాలా కృతజ్ఞుడను.

నేను వ్రాసిన పుస్తకాలనిచ్చి మీ వద్దకు ఎవరినైనా పంపాలని ప్రయత్నించి విఫలుడనై, రెండు పుస్తకాలు కొరియర్‌లో పంపుతున్నాను. ఇంకా ఉన్నాయి. మరీ పెద్దపుస్తకాలు కావడం చేత కొరియర్‌లో పంపలేకపోతున్నాను. ఎవరైనా వస్తునప్పుడు పంపుతాను. మీకు వీలైతే మా ఆశ్రమానికి రావలసిందిగా ఆహ్వానిస్తున్నాను. మీరు, మీ పిల్లలు, పత్రిక నూరేళ్ళ చల్లగా వర్ధిల్లాలని కోరుకుంటూ శలవు తీసుకుంటున్నాను. భవదీయుడు

**చిలుకూరు వెంకటేశ్వర్లు**

**పి.ఎస్. : ఈ వెబ్‌సైట్‌ను ఎక్కుమంది వినియోగించుకుని ప్రయోజనం పొందాలని కోరిక. తమకు పరిచయస్తులైన దేశవిదేశీయులకు తెలుపగోరెదను. లేదంటే వారి మెయిల్ ఐడి తెలిపితే నేనే పంపుతాను.** – చి॥వె.

# అనగనగా వినగా ఓ కోట... అది సముద్రంలో వెలసింది

**కృష్ణుడు సముద్రంలో ద్వారక పట్టణం నిర్మించాడంటే ఆశ్చర్యపోతాం. ఛత్రపతి శివాజీ ముట్టడించిన కోట సముద్రంలోనే ఉన్నదంటే చరిత్ర అంటాం**



ఛత్రపతి శివాజీ ఆ కోటపై దండెత్తాడనే చరిత్ర ఉన్నది. బ్రిటిష్, డచ్ సేనలు కూడా వశపరచుకోవాలని చూశాయి. కానీ ఎవరూ జయించలేకపోయారు. అందుకే అది చరిత్రలో ఆ కోట గొప్పగా నిలిచిపోయింది సముద్రం మధ్యలో నిర్మించిన. ఆ కోట నిర్మాణశైలి అత్యద్భుతమే! మహారాష్ట్ర రాయ్‌గఢ్ జిల్లా మురుద్‌పట్టణం దగ్గర అరేబియా సముద్రంలో ఉన్న 'మురుద్ జంజీరా కోట' గురించిన విశేషాలే ఇవన్నీ. ఈ కోట నుంచి రాజ్‌పురి అనే ఊరికి ఓ రహస్య సొరంగం కూడా ఉంది.



సముద్రంలో గుడ్డు ఆకారంలో ఉన్న ఓ కొండపై దీన్ని రాళ్లతో దృఢంగా నిర్మించారు. ఇదిప్పుడు పర్యాటక కేంద్రమైంది. ఈ కోటను చూడటానికి వందలాది మంది పడవల్లో వస్తుంటారు. చరిత్ర చెప్పుకోవాలంటే ఎన్నో వందల సంవత్సరాల వెనక్కి వెళ్లాలి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో సముద్రపు దొంగలు ఎక్కువగా ఉండేవారు. వారి నుంచి తప్పించుకోవడానికి జాలర్లు ఈ కొండపై కలపతో ఓ కోటను కట్టుకున్నారు. తర్వాత 15వ శతాబ్దంలో అహమ్మద్‌నగర్ నిజాంషా పాలకుడైన పీర్‌ఖాన్ హయాంలో రాళ్లతో విశాలమైన కోటను నిర్మించారు. తర్వాత సిద్దీ పాలకులు ఈ కోటను వారి రాజధానిగా చేసుకొని పాలించారు. అప్పుడు ఛత్రపతి శివాజీతోపాటు ఈ కోటపై బ్రిటిష్, డచ్‌వాళ్లు కూడా దండెత్తారు. కానీ సిద్దీలను ఏ ఒక్కరూ ఓడించలేకపోయారు. అందుకే మహారాష్ట్రలో ఓటమెరుగని ఒకే ఒక గొప్ప కోటగా చరిత్రలో నిలిచిపోయింది.

సముద్రంలో ఈ భారీ రాతి కోటను ఇంత అద్భుతంగా ఎలా నిర్మించారో ఇప్పటికీ అంతు పట్టదు. శత్రువుల నుండి తప్పించుకోవడానికి ఈ కోట నుంచి ఓ సొరంగంతోపాటు అనేక రహస్య ద్వారాలున్నాయి. సుమారు 40 అడుగుల ప్రహరీ గోడలతో ఉన్న దీంట్లో ఓ పెద్ద భవంతితోపాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. భారీ మంచినీళ్ల ట్యాంకు, ఉద్యోగులకు ప్రత్యేకంగా వసతిగదులు, మసీదు కూడా ఉన్నాయి. దీంట్లో అడుగడుగునా శిల్ప సంపద అబ్బురపరుస్తుంది. ఎన్నో జంతువుల ఆకృతులు, చెక్కడాలు కనువిందు కలిగిస్తాయి. కోట చుట్టూ ఉన్న భారీ ఫిరంగుల్ని ఇప్పటికీ దర్శించగలం.

## ప్రాతః స్మరణీయమైన ధూళిపాళ వారి పాత లేఖ

**మారుతి సేవేంద్ర సరస్వతిస్వామి**

**మాన్య మహోదయులు శ్రీగోటేటివారికి**

మీరు పంపిన 'ప్రముఖాంధ్ర'– శతపత్రసుందరి చేరింది. పరమానందం.

మీ నిర్విరామ కృషి, అకుంఠిత దీక్ష అత్యభినందనీయం. దాదాపు అన్నిరంగాల ప్రముఖుల చరిత్రలు యీ సంచిక ద్వారా ప్రపంచాని కందించారు.

ముఖ్యంగా పత్రికా, సాహిత్య రంగాలకు ఎనలేని సేవలర్పించిన మహనీయులెందరినో మరల గుర్తు చేశారు. అమెరికాలోని రచయితలు, వారి విశాల తెలుగు భాషాభిమానం, వారి వ్యాస ఆసక్తి, భాషా పటిమ ప్రతి తెలుగువారిలో పరిపూర్ణంగా భాసిస్తే తెలుగు భాషకు మరింత వెలుగువస్తుందనడం నిర్వివాదాంశం. దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన త్యాగధనులను చదువరులకు గుర్తు చేశారు. ఇక సాంఘిక సేవాతత్పరులు, తెలుగు సామ్రాజ్య స్థాపకులు, సురభి నాటక సంస్థల ఆర్యులు– ఎందరో– మరెందరినో ప్రపంచానికి తెలియచెప్పారు. అందరికీ ఆ సర్వేశ్వరుని పరిపూర్ణ ఆశీస్సులు అందాలి.

అన్నీ బాగున్నాయి– కాని– మీ శ్రీమతిగారి అకాల మరణవార్త మా అందరి హృదయాలను కలిచివేసింది. అది దైవనిర్ణయం.

**'జాతస్యహి ధృవో మృత్యుః ధ్రువం జన్మమృతస్యచ**
**తస్మా దపరిహార్యేర్థే నత్వం శోచి తుమర్హసి'**

మీకు క్రొత్తగా చెప్పవలసినది లేదు.

ఆవిడగారి ఆత్మకు పరమశాంతిని పరమేశ్వరుడు అనుగ్రహించుగాత ధైర్యంగా ముందుకు నడవండి. అన్ని రంగాలకు మీ సేవను పంచండి. దైవానుగ్రహపాత్రులు కండి.

సదా తమ శ్రేయోభిలాషి, నారాయణ స్మరణ పూర్వక శుభాశీస్సులతో

**– మారుతీ సేవేంద్ర సరస్వతిస్వామి,** గుంటూరు **(ధూళిపాళ)**

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

b-d

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**




## ఆనాటి 'అధ్యాత్మ రామాయణం' ఆవిష్కరానుభూతి ఈనాటికీ ఆనందాన్ని చవులూరింపచేస్తూన్నది!

# రామనామ స్మరణం... కలి దోష హరణం!

కలియుగంలో మానవుని దోషాలు రామనామస్మరణతో తొలగిపోతాయని శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధీశులు శ్రీవిద్యా స్వరూపానందగిరి స్వామి అభివర్ణించారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'రామాయణంపై' జాతీయ సదస్సు జరిగి రెండు సంవత్సరాలైంది! మెరీనాలోని పరదిమార్ కలైంజర్ వజ్రోత్సవ ప్రాంగణం వేదిక. 'ప్రముఖాంధ్ర' సంపాదకులు గోటేటి శ్రీరామారావు రచించిన 'అధ్యాత్మ రామాయణం' పుస్తకాన్ని స్వామీజీ ఆవిష్కరించి, తొలి ప్రతిని ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మభూషణ్ డాక్టర్ పి. సుశీలకు అందజేశారు. జనసామాన్యానికి సులభంగా అర్థమయ్యేలా తెలుగులో అందునా వచన రూపంలో అధ్యాత్మ రామాయణం రచించిన రచయిత గోటేటి ధన్యజీవి అని ప్రశంసించారు. రచయితను పి. సుశీల స్వర్ణకంకణంతో ఘనంగా సత్కరించారు. రామకథపై సినిమాల్లో పాటలు పాడే అవకాశం తనకు లభించడం ఘంటసాల పుణ్యమన్నారు సుశీల. 'ఊరకే కన్నీరు నింప కారణమేమమ్మా' పాటను గానం చేసి అభిమానులను ఆమె సంతోషపెట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం పురాణేతిహాసాల ప్రత్యేక పూర్వ అధికారి డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య కీలకోపన్యాసం చేస్తూ వాల్మీకి రామాయణం రామకథయనీ, వ్యాసుని అధ్యాత్మ రామాయణం రామతత్వాన్ని తెలుపుతోందన్నారు. రాజధాని కళాశాల ప్రాచార్యులు డాక్టర్ ఎల్బీ శంకరరావు గ్రంథ పరిచయం చేస్తూ రామాయణాలన్నింటిలో అధ్యాత్మ రామాయణానికి అగ్రతాంబూలం దక్కుతుందన్నారు. రచయిత రచనాశైలిని పరిచయం చేశారు. సెమినార్ డైరెక్టర్ డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ రామాయణంపై తొలి సదస్సును తామే నిర్వహిస్తున్నామన్నారు. అతిథులను పరిచయం చేస్తూ వారి సాధనలను వివరించారు. రచయిత గోటేటి శ్రీరామారావు తన స్పందనను తెలియజేస్తూ గ్రంథ రచనకు ప్రోత్సహించిన సంఘటనలు తెలిపారు. వ్యాసుని నాలుగువేల శ్లోకాల్లో రచించిన అధ్యాత్మరామాయణంలో నాలుగు వేదాల సారాలు ఇమిడి ఉన్నాయన్నారు. పుస్తకముద్రణకు ఆర్థిక సహాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. గోటేటి కుటుంబ సభ్యులు దాతలను పట్టు శాలువలతో, జ్ఞాపికతో ఘనంగా గౌరవించారు. ద్రావిడదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు వి. కృష్ణారావు, ఎస్‌డీఆర్ కళాపీఠం వ్యవస్థాపకుడు ఎస్. దశరథరామిరెడ్డి, తమిళనాడు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు తదితరులు రచయిత గోటేటిని సత్కరించారు. ప్రముఖ పాత్రికేయుడు రెంటాల జయదేవ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి నేపథ్యగాయని ఎస్పీ వసంతలక్ష్మి ప్రార్థనగీతాన్ని ఆలాపించారు. డాక్టర్ విస్తాలి శంకరరావు వందన సమర్పణ చేశారు. ముందుగా మద్రాసు విశ్వవిద్యాలయం ఎంఏ భరతనాట్యం విద్యార్థినులు డి. ప్రియాంక, కె. జస్లిన్ 'జానకీ రమణ దశరథ నందన' అంటూ రామాయణంలోని ప్రధాన ఘట్టాలను రసరమ్యంగా అభినయించారు.

**రామాయణాలపై ఆనాటి సదస్సు**

విరామానంతరం పలు రామాయణాలపై ఏర్పాటైన జాతీయ సదస్సుకు డాక్టర్ వై.బాలశౌరిరెడ్డి అధ్యక్షత వహించారు. తెలుగులో అధ్యాత్మ రామాయణాల గురించి డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, గోటేటి అధ్యాత్మ రామాయణంపై సినీ గేయ రచయిత భువనచంద్ర, రంగనాథ రామాయణం గురించి డాక్టర్ అంబుమణి (రాజధాని కళాశాల), మొల్ల రామాయణం గురించి డాక్టర్ కాసల నాగభూషణం (డీజీ వైష్ణవ కళాశాల), రామాభ్యుదయంపై డాక్టర్ విస్తాలి శంకరరావు (మద్రాసు విశ్వ విద్యాలయం), రామాయణ కల్పవృక్షం గురించి డాక్టర్ వారణాసి శివరామకృష్ణ (అవధాని) పత్రాలు సమర్పించి, సదస్సును నభూతో న భవిష్యతి అనేట్టు చేసిన క్షణం మరుపురాని మధురక్షణం. ●

# 'గణపతి ఒక్కడే మెత్తనివాడు!



గరికపోచతో అర్చించినా సంబరపడి పోతాడు. ఎవరైనా ఏవిధంగా పరహసించినా ఏంవీ అనుకోడు! పార్వతమ్మ పిండి బొమ్మను చేసి ప్రాణం పోసింది కదా! 'అమ్మ' ఆజ్ఞను మీరనందుకు పరమశివుడు త్రిశూలంతో తలనరికి ఏనుగు తలను మొండెము కతిగించినా విషణ్ణుడు కాలేదు, బాధపడలేదు. రకరకాల జగాల్లో రికరికాలుగా చిత్రించినా మౌనమే వహించాడు.

గణపతి... భక్త సులభుడు. కళాసులభుడు. ఆయనంటే కళాకారులకు పండగే. కోరినన్ని కోటి రూపాల్లో ఇమిడిపోతాడు. అదే బెజవాడకు చెందిన బిళ్ల వెంకట శ్రీనివాసరావు వస్త్రవ్యాపారి. తంజావూరు, జైపూర్, వారణాసి, ఢిల్లీ, మైసూరు, కొచ్చిన్... దేశమంతటా తిరిగారు. చైనా, వియత్నాం, కంబోడియా, ఇండోనేషియా, మయన్మార్, థాయ్‌లాండ్, నేపాల్... దేశాలు ప్రపంచమంతా సందర్శించారు. ఎక్కడికెళ్లినా ఏదో ఒక రూపంలో గణ నాథుడు దర్శనమిచ్చి, బొజ్జగణపయ్య అక్కడివారిని అబ్బురపరచేవాడు. అలా... పద్దెనిమిదేళ్ల క్రితం వినాయక విగ్రహాల సేకరణ మొదలైంది. ప్రస్తుతం శ్రీనివాసరావు వద్ద రెండు వేలకుపైగా అరుదైన గణపతి ప్రతిమలున్నాయి.

అన్ని విగ్రహాలను సేకరించడం... మాటలు కాదు. అదో గణపతి మహాయజ్ఞం! 'వినాయకుడంటే నాకు అనన్యమైన భక్తి.. అంతకు మించిన ఆసక్తి, ఓపికున్నంతకాలం విగ్రహాల సేకరణ సాగుతూనే ఉంటుంది అంటూ ఆయన చదరంగంపై ఆసక్తి చూపుతున్న గణనాథుణ్ణి మనకందించారు. ●

# జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

ఇతరులు ఏమి తలచినా, ఏమి చేసినా సరే నీవు మాత్రం నైతికవర్తనను, భగవద్భక్తి స్థాయిని దిగజార్చకు. భగవద్భక్తి వున్నంతవరకూ నీకు ఎలాంటి హాని కలగదు. - స్వామి వివేకానంద



గోటేటి వారింట దివ్య కళ్యాణము చూతము రారండీ (అమ్మాయి పేరు దివ్య) అంటా మీ అమ్మాయి. పెళ్ళి శుభలేఖ + అమెరికా తమ్ముడు సాయిప్రసాద్ కోడలు సుప్రీత అశ్వధ్ ఉపనయన ఆహ్వానాన్ని ముందుగా వినాయకుడికి మీదు కట్టి, ఇలవేలుపు వేంకటేశ్వరస్వామి, అలమేలు మంగల పాదాల నుంచి, తరువాత సద్గురు సాయినాధుడి పాదాల చెంతనుంచి, అమ్మ ఫోటో ముందు కాసేపు నిలబడి మొట్టమొదటి శుభలేఖను గురుదేవులు శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంగారికి ఇచ్చి వారి ఆశీస్సులు తీసుకొని అమ్మ తరఫున మా బెంగుళూరు మావయ్యకు, నాన్న తరఫున పాలకొల్లు అన్నయ్యకు మొదటి కార్డులను కొరియర్ చేసి తరువాత బంధుమిత్రులందరికి నెలరోజుల ముందే ఆహ్వానాన్ని పంపాను. నావరకూ ఈ వివాహానికి ఎంతో ప్రత్యేకత వుంది. కారణం మా పెద్దమ్మాయి పెళ్ళి, ఇంటిలో ముగ్గురు అన్నదమ్ముల పిల్లల్లోను పెద్దది. పెద్ద మనుమరాలు, బామ్మగారి గారాల మనవరాలు, చదువుల తల్లి, తన 24 ఏళ్ళ వయస్సులో ఎప్పుడూ నాకు ఏమాత్రం కష్టం కలిగించని బంగారు తల్లి. అందుకే ప్రత్యేకం. ఒక్కొక్కరి జీవితంలో ఒక్కొక్క డ్రీమ్ వుంటుంది. నాకు నా కూతురి పెళ్ళి ఒక అందమైన డ్రీమ్. అందులో నేనే ఏమేమైతే ఊహించుకున్నానో, అవన్నీ జరిపించగలిగాను. నా కలను నిజం చెయ్యటానికి నాకు చేయూతగా నిలిచిన నా భార్య లలిత, తమ్ముళ్లు నారాయణరావు, సాయిప్రసాద్, సుప్రీత, వారి పిల్లలు, నా చెల్లెళ్ళు (భార్య తరఫు బంధువులు) నా స్నేహితులు నాకోసం పగలనక, రాత్రనక నెల్నాళ్లు నాతో పాటు శ్రమించారు. ఎవరికి వారు వారింట్లో పెళ్లిలాగా కష్టపడ్డారు. నా వెన్నంటే వున్నారు. 80 ఏళ్ళ వయస్సులో మా నాన్నగారు ఆరోగ్యాన్ని లెక్కచెయ్యకుండా, ఆటోలోను, కార్లలోను తిరుగుతూ అలసటను లెక్కచెయ్యకుండా ఆయన తిరిగారు. ఇంతమంది మంచి మనుషుల, మనసుల శ్రమ ఫలితం అమ్మాయి పెళ్ళి అనుకున్నంత (కలగన్నంత) బాగా జరిగింది. ఇంత మంచి కార్యక్రమానికి దిష్టి ఏవో ఒకటి రెండు లుకలుకలు ఇక ఇకలు తప్ప. నేను ఎవరయితే తప్పకుండా వస్తారనుకున్నానో వారు రాలేదు. ఎవరయితే రారనుకున్నానో వారు వచ్చారు. ఎవరు నాకు చేదోడు, వాదోడుగా వుంటారనుకున్నానో వారు ముభావంగా వున్నారు. ఎవరు ముభావంగా వుంటారనుకున్నానో వారు నాకు అండగా నాతో శ్రమించారు. ఏమయితేనేమి రిసెప్షన్, పెళ్ళి, ఉపనయనము మూడు కార్యక్రమాలు అనుకున్నట్లు బాగానే జరిగాయి. పెళ్ళిరోజున సరిగ్గా ముహూర్త సమయాన శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ గారు స్వయంగా వచ్చి వధూవరులను ఆశీర్వదించడం మాకు ఎనలేని ఆనందం కలిగించింది. మా కుటుంబం పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలకు మేమంతా పులకించిపోయాం. తమిళనాడు రాష్ట్ర గవర్నర్, తమిళనాడు రాష్ట్ర తెలుగువారి అభిమాన పాత్రులు మాన్యశ్రీ కొణిజేటి రోశయ్య గారు ఆరోజు వారికెన్నో కార్యక్రమాలున్నా ప్రత్యేకంగా వచ్చి వధూవరులను ఆశీర్వదించడం ఇవన్నీ జీవితకాలం గుర్తుండిపోయే మధురస్మృతులు. వీరందరి హృదయాలలో మా నాన్నగారికెంతటి స్థానమున్నదో మాతోపాటు అందరికీ తెలిసింది. అలాగే అమ్మ తరఫున, నాన్న తరఫున, నా శ్రీమతి తరఫున, ఇంకా నా స్నేహితులు, శ్రేయోభిలాషులు రావడం ఆ మూడు రోజులు వారితో ఆనందంతో గడపడం ఇవన్నీ ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చాయి. ఆ ఆనందాన్ని మాటల్లో చెప్ప లేకపోతున్నాను, సరిగ్గా కాగితం మీద పెట్టలేకపోయాను. ఇంతటి ఆనందాన్ని కలిగించిన ఆ దేవుడిని, శ్రీరామచంద్రుణ్ణి స్మరించుకోకుండా వుండలేకపోతున్నాను. సరిగ్గా 2012 శ్రీరామనవమి రోజున కొంతమంది స్నేహితులం కలిసి మా స్నేహితుడు ఆవుల దామోదర్ ఇంటిలో (ఈ పెళ్ళిలో చాలా ముఖ్య పాత్ర వహించినవాడు) సీతాకళ్యాణాన్ని జరిపించాం. ఆరోజు శ్రీరామచంద్రుడు (వరుడి) తరఫున దామోదర్ దంపతులు, సీతమ్మ (వధువు) వారి తరఫున నేను, నా శ్రీమతి పీటల మీద కూర్చొని, కళ్యాణాన్ని జరిపించాం. ఇలా ప్రతి సంవత్సరం జరపాలని సంకల్పిస్తూ ఈసారి మరో రెండు జంటలకు ఆ అవకాశాన్నిచ్చాం. ఆంధ్రుల ఆరాధ్య దైవం అరణ్యవాసం సందర్భంగా గోదావరి తీరాన పంచవటిలో సేద తీర్చుకున్న ఆ భద్రాచల రాముడు మనకెంతో ఆదర్శప్రాయం. మన ఆంధ్రదేశంలో రామమందిరం లేని వూరు, రామనామం రుచి ఎరుగని నోరు వుండదంటే అతిశయోక్తి కాదు. ఆ 2012 సీతాకళ్యాణం రోజున త్రికరణశుద్ధిగా ఆ సీతారాముల కళ్యాణాన్ని జరిపిస్తూ వారి ముందు ఒక కోరిక నుంచాను. వచ్చే శ్రీరామనవమి లోపు అంటే 2013లోపు మా అమ్మాయి పెళ్ళి నిశ్చయం అయ్యి, మంచి వరుడు దొరికి పెళ్ళి బాగా జరగాలని భక్తి పూర్వకంగా వేడుకున్నాను. సద్గుణసాగరుడు, సత్యసౌహార్ద్ర హృదయుడు, శస్త్రాస్త్ర జ్ఞాన సంపన్నుడు, పరాక్రమవంతుడు, వినయ విధేయతలు కలవాడు, ఏకపత్నీవ్రతుడు, స్నేహశీలి, సోదరప్రేమ, పితృవాక్ పరిపాలకుడు, లోకపూజ్యుడు, సకల సుగుణాల సంపన్నుడు, శ్రీ సీతారామచంద్ర ప్రభు భక్తుల మనోభీష్టాల్ని ఎరిగినవాడు కాబట్టి నా కోరికను మన్నించి మా అమ్మాయి వివాహాన్ని అన్నమాట ప్రకారం (అంటే కోరుకున్న కోరిక ప్రకారం) మళ్ళీ శ్రీరామనవమికి అంటే 2013 శ్రీరామనవమికి అత్యంత వైభవంగా అమ్మాయి వివాహాన్ని జరిపించాడు. ఒక్కసారి అనుకుంటే ఇంత పెద్ద కార్యాన్ని (3 రోజుల కార్యక్రమాన్ని) ఎలా చెయ్యగలిగానా అని అనుకొన్నప్పుడు వానరుల చేత సాగరంపై వారధి కట్టించిన కరుణామూర్తి నాచేత ఆ పని ఎందుకు చేయించలేడు. చేసేవాడు, చేయించేవాడు ఆయనే కదా. “తక్కువేమి మనకు శ్రీశ్రీశ్రీ హనుమత్, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, సీతాసమేత శ్రీరామచంద్రుడుండు వరకు, తక్కువేమి మనకు శ్రితజన పోషకుండు డొక్కండుండువరకు–ఆ సీతారామచంద్ర ప్రభువు చల్లని అనుగ్రహ కిరణములు మా (మీ) కుటుంబంపై కురవాలని కోరుకుంటున్నాను” నిజమే. నమ్మినవాడిని ఆ భగవంతుడెపుడు విడిచిపెట్టడు. ●



తమిళనాడు గవర్నర్ మాన్యశ్రీ కె.రోశయ్యగారితో గోటేటి కుటుంబ సభ్యులు